పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :300 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | బుధవారం 4 నవంబర్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :300 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : TIRUPATI | WED 4 NOVEMBER 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ కూటమి హవా.. జగన్‌కు షాక్!

పులివెందులలోనూ టీడీపీ విజయం.. తిరుపతి మేయర్ పీఠం కైవసం.. పలు మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థుల గెలుపు

కడప జిల్లాలో 4 మున్సిపాలిటీలు టీడీపీ కైవసం.. బీజేపీ ఖాతాలో ఒకటి!

- జగన్ సొంత జిల్లా కడపలో వైసీపీకి ఎదురుదెబ్బ
- బద్వేల్, రాజంపేట, రాయచోటి, మైదుకూరు పురపాలికలు టీడీపీ కైవసం
- యర్రగుంట్ల మున్సిపాలిటీని గెలుచుకున్న బీజేపీ
- జిల్లాలో ఖాతా కూడా తెరవలేకపోయిన వైసీపీ

కుప్పంలో టీడీపీ క్లీన్ స్వీప్.. వైసీపీకి సున్నా

- మొత్తం 32 వార్డులను కైవసం చేసుకున్న టీడీపీ అభ్యర్థులు
- వైసీపీకి ఘోర పరాభవం
- ఫలితాలతో సంబరాల్లో మునిగిన టీడీపీ కార్యకర్తలు

- మిగతా 2లో

కార్పొరేషన్లు, మున్సిపాలిటీలపై కూటమి జెండాల రెపరెపలు

- మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం
- వైఎస్ జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో టీడీపీ చారిత్రక గెలుపు
- విశాఖ, విజయవాడ సహా 10కి పైగా కార్పొరేషన్లు ఎన్డీయే కైవసం
- ఒక్క నందికొట్కూరు మున్సిపాలిటీకే పరిమితమైన వైసీపీ
- ఇది ప్రజా విజయమన్న చంద్రబాబు, ఎన్నిక కాదు ఎంపిక అని ఆరోపించిన జగన్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 92 పట్టణ స్థానిక సంస్థల్లో జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు నవంబర్ 3న ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. ఈ ఎన్నికల్లో అధికార టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి పలు పట్టణ స్థానిక సంస్థల్లో ఆధిక్యం సాధించడంతో పాటు కీలక విజయాలను నమోదు చేసింది. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొన్ని ప్రాంతాల్లో ఎదురుదెబ్బ తగిలింది.

ఇది సుపరిపాలనకు దక్కిన విజయం



- స్థానిక ఎన్నికల ఫలితాలపై స్పందించిన సీఎం చంద్రబాబు
- సుపరిపాలనను చూసే ప్రజలు కూటమికి ఓటేశారని వెల్లడి
- రాజకీయాల కన్నా ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత అని ఉద్ఘాటన
- అమరావతి, పోలవరం పనులను వేగవంతం చేశామని వివరణ
- ప్రజలు మెచ్చే పాలన అందించడమే తమ లక్ష్యమని స్పష్టీకరణ

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!

- మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన వైసీపీ అధినేత జగన్
- చంద్రబాబు, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్ అంటూ వ్యంగ్యం
- ఇవి ఎన్నికలు కాదని, ఏకపక్షంగా జరిగిన సెలక్షన్లని ఆరోపణ
- నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ప్రక్రియను హైజాక్ చేశారని విమర్శ
- ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత స్పష్టమైందని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న వేళ, వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని ఆరోపిస్తూ, ఇవి ఎలక్షన్లు కావని, సెలెక్షన్లు అని ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు. చంద్రబాబు, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి జగన్ వ్యంగ్యంగా అభినందనలు తెలిపారు. "ప్రతిపక్షానికి

- మిగతా 2లో

ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా..

విజయం కూటమిదే



పెన్ పవర్ డెస్క్: పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితా లపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. "నగర పాలక, పుర పాలక, నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు దక్కిన అఖండ విజయాలు మా ప్రభుత్వ పాలనకు మద్దతుగా భావిస్తున్నాం. ఇది ఎంతో అమూల్యమైన తీర్పు. మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల పట్టణ ప్రజలు విశ్వాసం కనబరుస్తున్నారనడానికి ఈ ఫలితాలే నిదర్శనం. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ ఈవీఎంలను నిందించింది.

- మిగతా 2లో



24 గంటలు గడుస్తోంది.. ఏమైపోయారు మోదీజీ

పెన్ పవర్ డెస్క్:విదేశీ శక్తుల కోసం గంటలు గడుస్తోంది.. బహిరంగ ఎవరు పనిచేస్తున్నారో.. ఎవరు దేశ ద్రోహినో తేల్చేద్దాం రండి అంటూ ఓపెన్ డిబేట్ కు సవాల్ చేసిన లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. మరోసారి తన ఛాలెంజ్ ను గుర్తు చేశారు. నేను ఛాలెంజ్ చేసి 24 చర్చకు రాలేదేంటి మోదీగారు.. అంటూ మరో ట్వీట్ చేశారు. 2026 నవంబర్ 3న ప్రధాని నరేంద్ర మోదీకి మళ్లీ ఓపెన్ డిబేట్ సవాలు విసిరారు రాహుల్.

- మిగతా 2లో

మురసు తుపాను ఎఫెక్ట్..

చిలకలూరిపేట హైవేపై వరద నీరు, విజయవాడలో ఎడతెరిపిలేని వాన

- మురసు తుపాను ప్రభావంతో పల్నాడు జిల్లాలో భారీ వర్షాలు
- చిలకలూరిపేటలో జాతీయ రహదారిపైకి చేరిన వరద నీరు
- విజయవాడలో 10 గంటలుగా కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం
- బుడమేరుకు మళ్లీ వరద వస్తుందని ప్రజల్లో భయాందోళనలు

- మిగతా 2లో





రాహుల్ గాంధీ నిద్రపోతున్న పోస్టర్లు.. కోల్‌కతా సాల్ట్ లేక్ లో కలకలం!

- కోల్‌కతాలో రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా పోస్టర్లు
- పార్లమెంట్‌లో నిద్రపోతున్నట్లుగా ఉన్న చిత్రాలతో ప్రచారం
- "దేశ నాయకుడు ఇలాగేనా ఉండేది?" అంటూ పోస్టర్లపై నినాదం
- ఓటర్ల జాబితాపై రాహుల్ ఆందోళన చేస్తున్న సమయంలో ఈ పరిణామం

- మిగతా 2లో

- ఈ పోస్టర్ల వెనుక ఎవరున్నారనే దానిపై వీడని సస్పెన్స్

భార్యను తెలివి తక్కువది అనడం క్రూరత్వం కాదు..

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



- మిగతా 2లో

అణు దాడి జరిగితే 24 గంటలు

బయటకు రావొద్దు..

ప్రజలకు ఇరాన్ సంచలన సూచనలు!

- అణు దాడి నుంచి రక్షణకు ఇరాన్ 8 నిమిషాల వీడియో విడుదల
- కనీసం 24 గంటలు ఆశ్రయంలోనే ఉండాలని సూచన
- ఏసీలు, బయట గాలిని తెచ్చే వెంటిలేషన్ వ్యవస్థలు ఆపేయాలంటూ వీడియో
- కిటికీలకు దూరంగా బేస్‌మెంట్లలో ఆశ్రయం పొందాలని సూచన
- పికాక్స్ మౌంటెయిన్‌పై అమెరికా దాడి ఊహాగానాల వేళ మార్గదర్శకాల విడుదల

- మిగతా 2లో



ఇది సంబరాలకు కాదు, సేవకు సమయం

పురపాలిక తీర్పుపై నారా లోకేశ్

- పురపాలిక తీర్పును వినయంతో స్వీకరిస్తున్నామని తెలిపిన మంత్రి లోకేశ్
- గత రెండున్నరేళ్ల సుపరిపాలనకు ప్రజలిచ్చిన ఆశీర్వాదమే ఈ విజయమన్న లోకేశ్
- గెలుపొందిన టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులకు అభినందనలు
- అహంకారానికి తావులేదని, పార్టీలకతీతంగా అందరికీ సేవ చేస్తామని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:పురపాలిక ఎన్నికల ఫలితాలు సంబరాలు చేసుకోవడానికి కాదని, ప్రజలకు మరింత సేవ చేసేందుకు లభించిన అవకాశమని రాష్ట్ర మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు.

- మిగతా 2లో



అణు దాడి జరిగితే 24 గంటలు బయటకు రావొద్దు..

అమెరికా దాడి చేస్తుందనే ఆందోళనల నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వం ప్రజలకు అరుదైన అణు దాడి రక్షణ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఎనిమిది నిమిషాల నిడివి ఉన్న వీడియోలో అణు విస్ఫోటనం జరిగితే ఎలా ప్రాణాలు కాపాడుకోవాలో వివరించింది. భవనాల బేస్‌మెంట్లు, కిటికీలు లేని లోపలి గదుల్లో ఆశ్రయం పొందాలని, తలుపులు, కిటికీలు మూసివేయాలని సూచించింది. బయట గాలిని లోపలికి తీసుకొచ్చే ఏసీలు, వెంటిలేషన్ వ్యవస్థలను నిలిపివేయాలని తెలిపింది. దాడి తర్వాత కనీసం 24 గంటల పాటు ఆశ్రయంలోనే ఉండాలని, ప్యాక్ చేసిన ఆహారం, సీసాల్లోని నీటిని మాత్రమే వినియోగించాలని హెచ్చరించింది. ఈ మార్గదర్శకాలను ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ అక్టోబర్ 29న ప్రచురించింది.ఒకవేళ అణు విస్ఫోటనం సమయంలో ఎవరైనా బయట ఉంటే.. పేలుడు వెలుగును నేరుగా చూడొద్దని, నేలపై పడుకుని తల, ముఖాన్ని కాపాడుకోవాలని సూచించింది. పేలుడు ప్రభావం తగ్గిన తర్వాత సమీపంలోని బలమైన భవనంలోకి వెళ్లాలని తెలిపింది. వాహనాల్లో ఆశ్రయం పొందడం సురక్షితం కాదని స్పష్టం చేసింది. రేడియోధార్మిక ధూళి శరీరంపై పడితే బయట దుస్తులను జాగ్రత్తగా తొలగించి, మూసిన సంచిలో ఉంచాలని, చర్మం, జుట్టును సబ్బు, గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలని సూచించింది. రేడియేషన్ ప్రభావం తగ్గించేందుకు వాడే అయోడిన్ మాత్రలను వైద్యుల సలహా లేకుండా తీసుకోవద్దని హెచ్చరించింది. అధికారిక సమాచారం కోసం బ్యాటరీతో పనిచేసే రేడియోలను సిద్ధంగా ఉంచుకోవాలని కూడా పేర్కొంది. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ ప్రావిన్స్ అత్యవసర సేవల విభాగం రూపొందించిన ఈ వీడియో వెలువడటం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. నతాంజ్ అణు కేంద్రానికి సమీపంలోని పికాక్స్ మౌంటెయిన్‌పై అమెరికా దాడి చేసే అవకాశం ఉందన్న ఊహాగానాల మధ్య ఈ సూచనలు వచ్చాయి. అక్టోబర్ 16న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకునే అవకాశాన్ని ప్రస్తావించినప్పటికీ, అణ్వాయుధాలు ఉపయోగించబోమని స్పష్టం చేశారు.ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ దాడి కోసం అమెరికాపై ఒత్తిడి తెస్తున్నారంటూ జర్నలిస్ట్ టక్కర్ కార్ల్‌సన్ చేసిన ఆరోపణలు కూడా ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. అయితే ఈ మార్గదర్శకాలు ఇరాన్ నిర్వహిస్తున్న పౌర రక్షణ వారోత్సవాల్లో భాగంగా విడుదలయ్యాయని సమాచారం.

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!

- మొదటి పేజీ తరువాయి

పోటీ చేసే అవకాశమే ఇవ్వకుండా ఎన్నికల్లో అద్భుతంగా ఎలా గెలవచ్చో నిరూపించినందుకు చంద్రబాబు టీమ్, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.నామినేషన్ల దగ్గరి నుంచి మొదలుకొని స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం, పోలింగ్ సరళి, పోలింగ్ శాతం, చివరకు కౌంటింగ్ వరకు ప్రతీ దశను అధికార పక్షం హైజాక్ చేసిందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోలేదని, అధికార పార్టీయే వారిని సెలెక్ట్ చేసిందని ఎద్దేవా చేశారు.ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో స్పష్టమవుతోందని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం దిశగా దూసుకెళుతుండగా, వైసీపీ అనేకచోట్ల పరాజయం పాలవుతున్న నేపథ్యంలో జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా.. విజయం కూటమిదే

- మొదటి పేజీ తరువాయి

ఇప్పుడు బ్యాలెట్ ద్వారా చేపట్టిన స్థానిక ఎన్నికలలోనూ ప్రజలు అదే స్థాయి విజయం కూటమికి ఇచ్చారు. ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా ప్రజలు కూటమి పక్షానే ఉన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీకి దక్కిన బలమైన మద్దతు ఎంతో విలువైనది. ఛైర్మన్, మేయర్ అభ్యర్థులకు దక్కిన విజయాలు, ఆధిక్యతలు పరిశీలిస్తుంటే.. పట్టణ, నగర ప్రజలు జనసేనకి ఇస్తున్న ఆదరణ ఎంతో విలువైనది. వారు పార్టీ పట్ల కనబరిచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. జనసేన, తెదేపా, భాజపాకి అండగా నిలిచిన ఓటర్లకు, జనసేన అభ్యర్థుల విజయం కోసం కృషి చేసిన తెదేపా, భాజపా నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ సహకారంతో.. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన అనుభవంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తాం. పురపాలక ఎన్నికల్లో వచ్చిన ఘన విజయాన్ని ఎంపీటీసీ, జడ్పీటీసి ఎన్నికల్లోనూ సాధిస్తామనే విశ్వాసం ఉంది" అని పవన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇది సంబరాలకు కాదు, సేవకు సమయం

- మొదటి పేజీ తరువాయి

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ లో కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న నేపథ్యంలో, ప్రజా తీర్పును తమ ప్రభుత్వం ఎంతో వినయంతో స్వీకరిస్తోందని, ఈ గెలుపు పట్ల తాము పొంగిపోవడంలేదని ఆయన పేర్కొన్నారు. పురపాలిక ఎన్నికల ఫలితాల ట్రెండ్ పై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు.గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో కొనసాగుతున్న సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదమే ఈ విజయమని లోకేశ్ అభివర్ణించారు. ఈ విజయం కోసం సమష్టిగా కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కూటమి తరఫున గెలుపొందిన అభ్యర్థులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు."ఎన్నికలు ముగిశాయి. ఇక మా ఏకైక లక్ష్యం సేవ మాత్రమే. పార్టీలకు అతీతంగా ప్రతి పౌరుడికి సేవ చేస్తాం. ఇక్కడ అహంకారానికి ఎలాంటి తావులేదు" అని లోకేశ్ స్పష్టం చేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ అసలైన బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు గతంలో కంటే మరింత కష్టపడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా తీర్పు తమపై మరింత బాధ్యతను పెంచిందని, దానిని నిబద్ధతతో నెరవేరుస్తామని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.

ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ కూటమి హవా.. జగన్‌కు షాక్!

ఏపీలో జరిగిన పుర పోరు లో కూటమి అభ్యర్థులు సత్తా చాటారు. జగన్ సొంత నియోజకవర్గం కడప జిల్లా పులివెందులలోనూ తెదేపా జెండా రెపరెపలాడింది. కూటమి మేయర్ అభ్యర్థులు.. తిరుపతిలో మన్నె శ్రీనివాస ప్రసాద్, చిత్తూరులో కఠారి హేమలత, గుంటూరులో కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, మచిలీపట్నంలో షేక్ అబ్దుల్లా అబీదా, విశాఖలో ముక్కా శ్రావణి, ఏలూరులో రెడ్డి అప్పలనాయుడు, కర్నూలులో ప్రత్యూష ఘన విజయం సాధించారు. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల్లో నందికొట్కూరు మున్సిపాలిటీలో మాత్రమే వైకాపా గెలుపొందింది. ఆదోనిలో జనసేన రెబల్ స్వప్న విజయం సాధించారు. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.

కూటమి అభ్యర్థులు గెలుపొందిన మున్సిపాలిటీలు ఇవే..

తెదేపా: నర్సీపట్నం, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, పెద్దాపురం, కొవ్వూరు, మండపేట, ఆకివీడు, పిఠాపురం, నూజివీడు, జగ్గయ్యపేట, జంగారెడ్డిగూడెం, ఉయ్యూరు, నందిగామ, జగ్గయ్యపేట, కొండపల్లి, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, రేపల్లె, కనిగిరి, ఆత్మకూరు(నెల్లూరు), ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు(నంద్యాల), కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుత్తి, పెనుకొండ, కమలాపురం, రాజంపేట, ప్రొద్దుటూరు, బద్వేల్, మైదుకూరు, మదనపల్లి, పుంగనూరు, రాయచోటి, వెంకటగిరి, సూళ్లూరుపేట, పలమనేరు, కుప్పం, నగరి, పులివెందుల, బొబ్బిలి, మాచర్ల, బుచ్చిరెడ్డిపాలెం, కల్యాణదుర్గం, డోన్, హిందూపురం, రామచంద్రాపురం, వినుకొండ, మార్కాపురం, రాయదుర్గం, గుంతకల్, ధర్మవరం, ఏలేశ్వరం

జనసేన: గొల్లప్రోలు, తుని, సామర్లకోట, పిఠాపురం, ముమ్మిడివరం, అమలాపురం, నిడదవోలు, నర్సాపూర్, పెడన, తిరువూరు, తెనాలి, దర్శి, మడకశిర, పుట్టపర్తి, మడకశిర, పాలకొండ, పుత్తూరు

భాజపా: గూడూరు(కర్నూలు), ఎర్రగుంట్ల, ఎలమంచిలి,గిద్దలూరు

కుప్పంలో టీడీపీ క్లీన్ స్వీప్.. వైసీపీకి సున్నా

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి విజయాల బాటలో పయనిస్తోంది. ముఖ్యంగా, చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపాలిటీలో టీడీపీ అభ్యర్థులు అఖండ విజయం సాధించారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 32 వార్డులను కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేశారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి ఒక్క సీటు కూడా దక్కలేదు. కనీసం ఖాతా కూడా తెరవకపోవడంతో ఆ పార్టీకి కుప్పంలో తీవ్ర నిరాశ ఎదురైంది. కుప్పం ఫలితం టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.కుప్పంలో టీడీపీ సాధించిన ఈ ఘన విజయంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. ఫలితాలు వెలువడిన వెంటనే పలుచోట్ల బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

కడప జిల్లాలో 4 మున్సిపాలిటీలు టీడీపీ కైవసం.. బీజేపీ ఖాతాలో ఒకటి!

ఆంధ్రప్రదేశ్ పురపాలక ఎన్నికల ఫలితాల్లో వైసీపీకి ఊహించని షాక్ తగిలింది. ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లా అయిన కడపలో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించింది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలను టీడీపీ కైవసం చేసుకోగా, మరొకటి మిత్రపక్షమైన బీజేపీ దక్కించుకుంది. ఈ ఫలితాలతో వైసీపీ కంచుకోటగా భావించే కడప జిల్లాలో ఆ పార్టీ ఖాతా తెరవలేకపోయింది.

మంగళవారం వెలువడిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కడప జిల్లాలోని బద్వేల్, రాజంపేట, రాయచోటి, మైదుకూరు మున్సిపాలిటీల్లో టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. మరో కీలకమైన యర్రగుంట్ల మున్సిపాలిటీ (నగర పంచాయమతీ)ని బీజేపీ కైవసం చేసుకుంది. దీంతో జిల్లాలోని మొత్తం ఐదు పురపాలికలు టీడీపీ-బీజేపీ కూటమి ఖాతాలో పడ్డాయి.

దశాబ్దాలుగా వైఎస్ కుటుంబానికి రాజకీయంగా అండగా నిలుస్తున్న కడప జిల్లాలో, ముఖ్యంగా జగన్ సొంత గడ్డపై వైసీపీ ఒక్క మున్సిపాలిటీలో కూడా గెలవలేకపోవడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఈ అనూహ్య ఫలితాలు జిల్లాలోని టీడీపీ, బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపాయి. ఫలితాలు వెలువడిన వెంటనే టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. ఇది ప్రజల విజయమని, వైసీపీ పాలనపై తిరస్కారానికి నిదర్శనమని కూటమి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ గెలుపు రాయలసీమ రాజకీయ సమీకరణాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

నవంబర్ 3 మధ్యాహ్నం వెలువడిన ఎన్నికల ట్రెండ్స్ ప్రకారం:

పార్టీ / కూటమి	ఆధిక్యం
టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ	10 / 13 కార్పొరేషన్లు
ఎన్డీఏ కూటమి	62 మున్సిపాలిటీలు
వైఎస్సార్‌సీపీ	4 మున్సిపాలిటీలు
స్వతంత్రులు	3 మున్సిపాలిటీలు

కీలక విజయాలు ఎవరివంటే?

- తిరుపతి: టీడీపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస ప్రసాద్ (జేబీ) మేయర్ ఎన్నికల్లో 30,972 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- పులివెందుల: టీడీపీ అభ్యర్థి తుగుట్ల గీతాకుమారి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో 13,875 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- ఉయ్యూరు: టీడీపీ అభ్యర్థి చెన్నం వెంకటేశ్వరరావు మున్సిపల్ చైర్మన్‌గా విజయం సాధించారు.
- కొవ్వూరు: టీడీపీ అభ్యర్థి విజయలక్ష్మి కంఠమనేని 9,668 ఓట్ల మెజారిటీతో చైర్‌పర్సన్‌గా గెలిచారు.
- పెద్దాపురం: జనసేన పార్టీ ఒక ప్రారంభ విజయాన్ని నమోదు చేసింది.

ఏయే ప్రాంతాల్లో ఎన్నికలు జరిగాయి?

- 13 మున్సిపల్ కార్పొరేషన్లు
- 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు
- మొత్తం 92 పట్టణ స్థానిక సంస్థలు

కొన్ని స్థానాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 17 మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాలు కూటమి అభ్యర్థులకు ఏకగ్రీవంగా దక్కాయి. 118 డివిజన్లు, 637 వార్డుల్లోనూ ఏకగ్రీవ ఫలితాలు నమోదయ్యాయి.

మురసు తుపాను ఎఫెక్ట్.. చిలకలూరిపేట హైవేపై వరద నీరు, విజయవాడలో ఎడతెరిపిలేని వాన

మురసు తుపాను ప్రభావంతో పల్నాడు, గుంటూరు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మంగళవారం కురిసిన కుండపోత వర్షాలకు అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ముఖ్యంగా పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద చెన్నై--కోల్‌కతా జాతీయ రహదారిపైకి భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.చిలకలూరిపేట పట్టణంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. జాతీయ రహదారిని వరద ముంచెత్తడంతో పాటు, పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అయితే, అధికారులు ముందుజాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మరోవైపు, విజయవాడ నగరాన్ని కూడా వర్షం ముంచెత్తింది. గత 10 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో నగరంలోని అనేక కాలనీలు, బస్తీలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. గత అనుభవాల నేపథ్యంలో, బుడమేరు వాగుకు మళ్లీ వరద పోటెత్తుతుందేమోనని స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం సహాయక చర్యలపై దృష్టి సారించింది.

ఇది సుపరిపాలనకు దక్కిన విజయం: సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు స్పందించారు. వెలువడుతున్న ఫలితాల్లో అధికార కూటమి స్పష్టమైన ఆధిక్యం దిశగా పయనిస్తోందని తెలిపారు. సాయంత్రానికి పూర్తిస్థాయి ఫలితాలు వెలువడి, మరింత స్పష్టత రానుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఎన్నికల ఫలితాలు తమ ప్రభుత్వ సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని ఆయన అభివర్ణించారు."మేం చేస్తున్న సుపరిపాలనను మెచ్చి, మా పనితీరును గమనించే ప్రజలు ఈ తీర్పు ఇచ్చారు. 'గుడ్ పాలిటిక్స్, గుడ్ గవర్నెన్స్' అనేదే నా ప్రాధాన్యత. రాజకీయమా, ప్రజల సమస్యల పరిష్కారమా అంటే.. నేను ఎప్పుడూ సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం ఇస్తాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. అర్నబ్ తుపాను సమయంలో మూడు రోజుల పాటు రాత్రింబవళ్లు సహాయక చర్యల్లోనే నిమగ్నమైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ.. "అనునిత్యం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికే పనిచేస్తున్నాం. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఇప్పటికే వెలిగొండ ద్వారా నీటిని అందించాం. అమరావతి పనులు పరుగులు పెట్టిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ధ్వంసమైన రోడ్లను ఇప్పుడు నిర్మిస్తున్నాం" అని తెలిపారు. అయితే, అన్ని సమస్యలు పరిష్కరించామని చెప్పడం లేదని, వారసత్వంగా వచ్చిన కొన్ని సమస్యలు ఇంకా ఉన్నాయని ఆయన అంగీకరించారు. ప్రజలకు సేవలందించే విషయంలో ఏమైనా పొరపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకుంటామని హామీ ఇచ్చారు.

కొందరు విమర్శలు చేస్తున్నా వాటిని పట్టించుకోకుండా ప్రజాసేవకే అంకితమయ్యామని చంద్రబాబు అన్నారు. "లబ్ధి పొందుతూ కూడా ఎగతాళి చేసేవారు ఉంటారు. కులాలు, మతాలు, మాకు ఓటు వేయని వారు అనే భేదాలు మేం చూడటం లేదు. అందరి కోసం పనిచేస్తున్నాం. ప్రజలు మెచ్చే పాలన అందించి, వారి ఇబ్బందులను దూరం చేయడమే మా లక్ష్యం" అని వివరించారు. ప్రజలు ఇదే విధంగా కూటమిని ఆశీర్వదించి, ప్రభుత్వానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భార్యను తెలివి తక్కువది అనడం క్రూరత్వం కాదు.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

వరకట్నం కేసులో సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భర్త తన భార్యను తెలివి తక్కువది, పనికిరానిది అనడం నేరంగా భావించలేమని స్పష్టం చేసింది. ఇలాంటి వ్యాఖ్యలు ఐపీసీ సెక్షన్? 498ఏ కిందకు రావని వ్యాఖ్యానించింది. 2023లో కెనడాలో ఆత్మహత్య చేసుకున్న ఓవివాహిత వరకట్నంలో కేసులో సుప్రీంకోర్టు ఈవ్యాఖ్యలు చేసింది. వివరాల్లోకి వెళితే.

భార్యను తెలివి తక్కువది ,పనికిరానిది అని భర్త అనడం ఐపీసీ సెక్షన్ 498ఏ కింద నేరంగా, క్రూరత్వంగా భావించలేమని, ఇలాంటి వ్యాఖ్యలు భర్త కోప స్వభావాన్ని, ప్రవర్తనా లోపాన్ని సూచించవచ్చని, అయితే వాటిని మాత్రమే ఆధారంగా చేసుకుని క్రిమినల్ కేసు నమోదు చేయలేమని స్పష్టం చేస్తూ కెనడాకు చెందిన ఓ వివాహిత ఆత్మహత్య కేసులో ఆమె భర్తపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

కెనడాలో భార్య ఆత్మహత్య.. భర్తపై కేసు

వివరాల్లోకి వెళ్తే.. కెనడాలోని టొరంటోలో నివసిస్తున్న ఓ వివాహిత ఉద్యోగం దొరకకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకుంది. ఆమె రాసిన సూసైడ్ నోట్‌లో చదువు, ఉద్యోగానికి సంబంధించిన సమస్యలను ప్రస్తావించింది. అయితే, ఆమె మరణం తర్వాత తండ్రి భారత్? లో ఆమె భర్తపై కట్న వేధింపులు, క్రూరత్వం వంటి ఆరోపణల ఫిర్యాదుతో కేసు నమోదు అయింది. ఈ కేసులో భర్త తన భార్యను తెలివి తక్కువదని, పనికిరానిదని దూషించేవాడని ఆరోపించారు. దీంతో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని భర్త కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం చివరకు సుప్రీంకోర్టుకు చేరింది.

స్పష్టమైన ఆధారాలు ఉండాలి

ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. భార్యను దూషించినంత మాత్రాన అది నేరపూరిత క్రూరత్వం కిందకు రాదని ధర్మాసనం అభిప్రాయపడింది. కేవలం కోపంతో మాట్లాడిన మాటలను క్రిమినల్ నేరంగా పరిగణించలేమని పేర్కొంది. భర్తపై కట్న వేధింపులు, శారీరక లేదా మానసిక హింసకు సంబంధించిన నిర్దిష్టమైన ఆధారాలు ఉండాలని స్పష్టం చేసింది. సాధారణమైన, అస్పష్టమైన ఆరోపణల ఆధారంగా క్రిమినల్ కేసులను కొనసాగించడం సరికాదని అభిప్రాయపడింది.

భర్తపై ఎఫ్ఐఆర్ కొట్టివేత

కేసులోని పరిస్థితులు, ఆధారాలను పరిశీలించిన సుప్రీంకోర్టు.. భర్తపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసింది. భార్య ఆత్మహత్యకు భర్తే కారణమని నిర్ధారించడానికి అవసరమైన ఆధారాలు లేవని పేర్కొంది. ఈ తీర్పు ద్వారా వైవాహిక వివాదాల్లో కేవలం సాధారణ ఆరోపణల ఆధారంగా క్రిమినల్ కేసులు కొనసాగించలేమనే విషయాన్ని మరోసారి స్పష్టం చేసింది.

24 గంటలు గడుస్తోంది.. ఏమైపోయారు మోదీజీ

- మొదటి పేజీ తరువాయి

24 గంటలు గడిచాయి మోదీ జీ. నేను మీకు సవాలు విసిరాను. మీరు ప్రతిపక్షం దేశద్రోహి అని అంటున్నారు. ఏ వేదికైనా, ఏ స్థలమైనా ఎంచుకోండి. నాతో డిబేట్ చేయండి. ఎవరు దేశద్రోహి? ఎవరికి విదేశీ శక్తులతో సంబంధాలు ఉన్నాయి? ఆ సంబంధాలు ఎలాంటివి? తేల్చేద్దాం.. అని రాహుల్ గాంధీ ఎక్స్ లో వీడియో పోస్ట్ చేశారు. వీలైనంత త్వరగా డిబేట్ చేద్దాం.. భయపడకండి అని కూడా చెప్పారు.డిబేట్ మీడియా, యువత సమక్షంలో జరగాలని రాహుల్ గాంధీ కోరారు. మోదీ ఎవరినైనా మోడరేటర్‌గా ఎంచుకోవచ్చని, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను కూడా నియమించవచ్చని సూచించారు. దేశ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక నిర్మాణం, అమెరికాతో ఒప్పందం ఎలా జరిగింది, ఎందుకు తొందరగా, కేబినెట్‌కు ఎందుకు తెలియజేయలేదు, అదానీ కేసు ఎందుకు మూసివేశారు, ఎప్‌స్టీన్ వంటి అంశాలపై చర్చించాలని అన్నారు. తనపై 45 దాకా దూషణ కేసులు ఉన్నాయని, కానీ విదేశీ సంబంధాలపై చేసిన వ్యాఖ్యలపై ఏ కేసు లేదని చెప్పి, కావాలంటే దావా వేయమని సవాలు విసిరారు. వీడియో చివర దీపావళి శుభాకాంక్షలు కూడా తెలిపారు.

యువతకు పోల్

భారత యువతా, రాహుల్ గాంధీ VS నరేంద్ర మోదీ ఓపెన్ డిబేట్ చూడాలనుకుంటున్నారా? అని అడిగి, ఆప్షన్లుగా -- మోదీ జీ, దరో మత్, No – మోదీ జీ, దర్ గయే.. ఆప్షన్లు ఇచ్చారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, యోగి ఆదిత్యనాథ్‌లను ట్యాగ్ చేసి మోదీని ఒప్పించమని కోరారు.ఈ సవాలుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. ఛత్తీస్‌గఢ్ రాజ్యోత్సవం ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని అంశాలపై పార్లమెంటులో చర్చకు సిద్ధమని చెప్పారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్), ఈవీఎంలు, చొరబాటుదారుల అంశాలపై ప్రత్యేక సమావేశం పిలిచి చర్చించడానికి సిద్ధమని షా సవాలు విసిరారు. హైదరాబాద్ నుంచి సవాలు విసురుతున్నాను. ప్రత్యేక సమావేశం పిలుస్తాం. డిబేట్‌కు రండి అన్నారు. బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిబేట్‌కు సిద్ధమని సవాలు విసిరారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు రాహుల్ గాంధీని విమర్శిస్తూ, భారత శత్రువుల అజెండాలను ముందుకు తీసుకెళ్లి ఇతరులపై విదేశీ మద్దతు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. అక్టోబర్ 31న రాష్ట్రీయ ఏకతా దివస్ సందర్భంగా మోదీ ప్రతిపక్షాన్ని దేశాన్ని విభజించే శక్తులు, సోషల్ మీడియా ద్వారా దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. దీనికి స్పందిస్తూ సోమవారం రాహుల్ గాంధీ మోదీ విదేశీ సహాయంతో ప్రధాని అయ్యారని, అలాగే కొనసాగుతున్నారని ఆరోపించి ఓపెన్ డిబేట్ సవాలు విసిరారు.

రాహుల్ గాంధీ నిద్రపోతున్న పోస్టర్లు.. కోల్‌కతా సాల్ట్ లేక్ లో కలకలం!

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని కోల్‌కతాలో వెలసిన పోస్టర్లు రాజకీయంగా కలకలం రేపాయి. నగరంలోని సాల్ట్ లేక్ ప్రాంతంలో మంగళవారం ఉదయం ఈ పోస్టర్లు దర్శనమిచ్చాయి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండగా రాహుల్ గాంధీ నిద్రపోతున్నట్లుగా ఉన్న చిత్రాలను ముద్రించి, "దేశ్ కీ నేతా ఐసా హో? (దేశ నాయకుడు ఇలాగేనా ఉండేది?)" అనే నినాదాన్ని వాటిపై జోడించారు. అయితే, ఈ పోస్టర్లను ఎవరు అంటించారనే దానిపై స్పష్టత లేదు. ఇప్పటివరకు ఏ వ్యక్తి గానీ, సంస్థ గానీ దీనికి బాధ్యత వహించలేదు. ఈ పోస్టర్లలో రాహుల్ గాంధీకి సంబంధించిన రెండు వేర్వేరు చిత్రాలు ఉన్నాయి. ఒక చిత్రంలో, ఆయన పార్లమెంట్‌లో చెంపలకు చేతులు ఆనించుకుని కళ్లు మూసుకుని ఉండగా, మరో చిత్రంలో సీటులో వెనక్కి వాలి కూర్చుని ఉన్నారు. ఈ చిత్రాల ద్వారా, రాహుల్ సభా కార్యక్రమాల సమయంలో నిద్రపోతున్నారని చెప్పే ప్రయత్నం జరిగింది.దేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు (ఎస్ఐఆర్) వ్యతిరేకంగా, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ ఢిల్లీలో విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చి ఉద్యమం చేస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.మరోవైపు, బీజేపీ దేశవ్యాప్తంగా 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకత్వాన్ని తొలగించండి' పేరుతో కౌంటర్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా సోమవారం కోల్‌కతాలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ పాలన నుంచి విముక్తి లభించినట్లే, ఢిల్లీకి కూడా రాహుల్ గాంధీ నుంచి త్వరగా విముక్తి కలగాలని ఆయన వ్యాఖ్యానించారు.మంగళవారం సిలిగురిలో జరిగిన ర్యాలీలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా నుంచి అక్రమ చొరబాటుదారులను తొలగించేందుకు ఎన్నికల సంఘం ప్రయత్నిస్తుంటే, వారిని కాపాడేందుకు మమతా బెనర్జీ, రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

ప్రపంచ కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఎంజీఎం విద్యార్థిని ప్రియదర్శినికి స్వర్ణం, కాంస్యం

శ్రీకాళహస్తి,పెన్ పవర్, నవంబర్ 03:
బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు నిర్వహించినవరల్డ్ కరాటే ఛాంపియన్‌షిప్2026లో శ్రీకాళహస్తి ఎంజీఎం స్కూల్ రెండో తరగతి విద్యార్థిని కె. ప్రియదర్శిని అద్భుత ప్రతిభ కనబరిచింది. అండర్7 విభాగంలో కటా పోటీల్లో మొదటి బహుమతిగా స్వర్ణ పతకం, కుమిటే విభాగంలో మూడో బహుమతిగా కాంస్య పతకాన్ని సాధించి పాఠశాలకు, శ్రీకాళహస్తికి గర్వకారణంగా నిలిచింది. ఈ అంతర్జాతీయ పోటీల్లో కజకిస్థాన్, రష్యా తదితర దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంజీఎం ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ శ్రీమతి గుడ్లూరు ఐశ్వర్య మాట్లాడుతూ..
తమ విద్యాసంస్థ చదువులతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన ప్రియదర్శినిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి క్రీడారంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య, హెడ్మాస్టర్ మునిరత్నం నాయుడు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొని ప్రియదర్శినిని అభినందించారు.



తొట్టంబేడులో మునిరాజా నాయుడు ప్రచార జోరు



- ఆరు గ్రామాల్లో విస్తృత ప్రచారం.. సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థన

తొట్టంబేడు, పెన్ పవర్ ,నవంబర్ 03:
తొట్టంబేడు మండలంలో టీడీపీ–ఎన్డీఏ కూటమి బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థి రావెళ్ల మునిరాజా నాయుడు సోమవారం తొట్టంబేడు, కత్తివారికండ్రిగ, బసవన్నగుంట, ఎస్టీ సెంటర్, ముడూరు, కారాకొల్లు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ పరిశీలకులు మాసారపు సుబ్బయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థి మునిరాజా నాయుడును సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నాయకులు, కార్యకర్తలు కోరారు. ప్రచారంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జి. దశరథ ఆచారి, మాజీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, ఎంపీటీసీ అభ్యర్థి తాటిపర్తి రవీంద్రారెడ్డి, రాష్ట్ర మైనారిటీ విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీర్ ఆలీ, శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ సభ్యుడు షేక్ షఫీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుడమేరు పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉంది.. కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 03,
బుడమేరు విషయంలో ప్రజలు భయాందోళనలకు గురికావద్దు.. పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉంది: కలెక్టర్ డా. జి. లక్ష్మీశ
క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.
కొండ ప్రాంతాలు మినహా ఇతర ప్రాంతాల ప్రజలను తరలించాల్సిన అవసరం లేదు.. పుకార్లను నమ్మవద్దు.
అపోహలు, ధృవీకరించని వార్తలను నమ్మవద్దు.. వాటిని ప్రచారం చేయవద్దు.జిల్లా యంత్రాంగం విడుదల చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించండి.కాన్పు తేదీ దగ్గరపడిన గర్భిణులను ముందస్తు జాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు తరలించాలి: సెక్టార్ అధికారులకు కలెక్టర్ ఆదేశం.సెక్టార్ అధికారులు ప్రతి వీధిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలి.పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహార సదుపాయాలను పక్కాగా సిద్ధం చేయాలి: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.

43వ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి రంగావజ్జుల గాయత్రి ఘన విజయం



గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 03,
గుంటూరు నగరంలోని 43వ డివిజన్‌లో తెలుగుదేశం, జనసేన పార్టీల మద్దతుతో భారతీయ జనతా పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థి రంగావజ్జుల గాయత్రి ఘన విజయం సాధించారు.
మొత్తం 1078 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థులపై విజయం సాధించి డివిజన్‌లో విజయభేరి మోగించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం రిటర్నింగ్ అధికారి వద్ద నుంచి రంగావజ్జుల గాయత్రి గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.
ఈ సందర్భంగా 43వ డివిజన్‌లో కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి ఈ విజయం నిదర్శనమని, డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని రంగావజ్జుల గాయత్రి పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.
ఈ ఘన విజయం సాధించిన రంగావజ్జుల గాయత్రికి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలియజేశారు.

బుచ్చి మున్సిపల్ ఎన్నికల ఫలితాలలో టీడిపి హవా





- బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలో వార్డ్ కౌన్సిలర్ల కౌంటింగ్ వివరాలు
బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 3.

1వార్డు టీడీపీ :- బెల్లం కొండ.కల్పన :418 ఓట్లువైసీపీ :- మల్లి. వెంకటరమణమ్మ :గెలుపు 522 ఓట్లు
ఒకటో వార్డు వైసీపీ అభ్యర్థి గెలుపు...
2వార్డు టీడీపి :- జూగుంట. ప్రమీల :గెలుపు 519 ఓట్లు
వైసీపీ :- గంగపట్నం. చిన్నబ్బాయ :307 ఓట్లు
రెండో వార్డు టిడిపి అభ్యర్థి గెలుపు...
3వార్డు
టీడీపీ :- బెళ్ళుం పద్మ :గెలుపు 592 ఓట్లు
వైసీపీ :- పంది. అనూష :170 ఓట్లు
మూడో వార్డు 425 ఓట్ల మెజారిటీతో టిడిపి అభ్యర్థి గెలుపు
4వార్డు రీ కౌంటింగ్
బిజెపి:- రామిశెట్టి. కేతన్ :
వైసీపీ :- ఆరు ముళ్ళ. సతీష్ బాబు :441 ఓట్లు
5వార్డు
టీడీపీ :- అందె. ప్రత్యూష :221 ఓట్లు
వైసీపీ :- కోటపూరి.ప్రవల్లిక :412 ఓట్లు
ఐదో వార్డు 200 ఓట్ల మెజారిటీతో వైసీపీ అభ్యర్థి గెలుపు...
6వార్డు
జనసేన : బిట్రగుంట.సరోజనమ్మ : 471 ఓట్లు
వైసీపీ :- బిట్రగుంట.ప్రమీలమ్మ :389 ఓట్లు
ఆరో వార్డు జనసేన అభ్యర్థి 78 ఓట్ల తో గెలుపు...
7వార్డు
టీడీపీ :- నెల్లూరు.దయాకర్ రెడ్డి :గెలుపు
వైసీపీ :- కనపరెడ్డి.వేణు :
ఏడవ వార్డు టిడిపి అభ్యర్థి గెలుపు
8వార్డు
జనసేన :- కత్తి మహేష్ :గెలుపు
వైసిపి :- కందుకూరి యానాదిరెడ్డి :325 ఓట్లు
ఎనిమిదో వార్డు జనసేన అభ్యర్థి గెలుపు
9వార్డు
టీడీపి:- నెల్లూరు.రమాదేవి :403 ఓట్లు
వైసీపీ :- షేక్.షాబీరా :436, ఓట్లు
9వ వార్డు 33 ఓట్ల మెజార్టీతో వైఎస్సార్సీపి అభ్యర్థి గెలుపు...
10 వార్డు
టీడీపి :- అత్తి పాటి పద్మ ఏకగ్రీవం
11వార్డు
టీడీపీ :- జఫరుద్దీన్ : గెలుపు 626, ఓట్లు
వైసిపి :- కుప్ప. పవన్ :423 ఓట్లు
11వ వార్డు టిడిపి అభ్యర్థి 203 ఓట్లతో గెలుపు
12వార్డు
టీడీపీ :- షేక్.రహమాత్ బాషా :,723 ఓట్లు
వైసీపీ :- షేక్.షావుల్:331 ఓట్లు
12వ వార్డు టిడిపి అభ్యర్థి 388 ఓట్లతో గెలుపు
13వార్డు
టీడీపీ :- షేక్.పర్వీన్ :364 ఓట్లు
వైసీపీ :- షేక్.సద్దాం :గెలుపు 482 ఓట్లు
13వ వార్డు వైఎస్ఆర్ సిపిఅభ్యర్థి గెలుపు
14వార్డు
టీడీపీ :- షేక్.అస్మా :గెలుపు 603 ఓట్లు ఓట్లు
వైసీపీ :- షేక్.రేష్మ :442 ఓట్లు
14 వ వార్డు టిడిపి అభ్యర్థి గెలుపు...
15 వార్డు
టీడీపీ :- మోర్ల మురళి ఏకగ్రీవం
16వార్డు
టీడీపీ :- వింజం.పద్మ : 488 ఓట్లు
వైసిపి :- నలుబోలు.విజయలక్ష్మి :290 ఓట్లు
16వ వార్డు టిడిపి అభ్యర్థి రెండు వందల ఓట్లతో గెలుపు...
17వార్డు
టీడీపీ :- ఎరటపల్లి. శివకుమార్ రెడ్డి :గెలుపు 648 ఓట్లు
వైసీపీ :- షేక్.షబ్బీర్ :122 ఓట్లు
17 వార్డు టిడిపి అభ్యర్థి గెలుపు
18 వార్డు
టీడీపీ :- చిలకా ఉష ఏకగ్రీవం
19వార్డు
టీడిపి :- దుగ్గిశెట్టి హరినాథ్ ఏకగ్రీవం
20వార్డు
టీడీపీ :- ఇమ్మడి శెట్టి.మల్లికార్జున : 482 ఓట్లు
వైసీపీ :- ఇన్నమూరి.నరసింహారావు :338 ఓట్లు
20వ వార్డు టిడిపి అభ్యర్థి 156ఓట్లతో గెలుపు
21వార్డు
టీడిపి :- బండ్ల.ధనలక్ష్మి :గెలుపు 762 ఓట్లు
వైసీపీ :- పర్రి.పెంచల లక్ష్మి తేజ :124 ఓట్లు
21వ అభ్యర్థి టిడిపి గెలుపు
22 వార్డు
బీజేపీ :-కాసా. శ్రీనివాసులు ఏకగ్రీవం
23వార్డు
టీడిపి :- తాళ్ల వైష్ణవి :గెలుపు 734 ఓట్లు
వైసిపి :- సాయి ప్రసన్న :125 ఓట్లు
23వ వార్డు టిడిపి అభ్యర్థి గెలుపు...
24వార్డు
బీజేపీ :- ఆలూరునాగవేణి :489 ఓట్లు
వైసీపీ :- చంబేటి రమణమ్మ :348 ఓట్లు
24 వ వార్డు బిజెపి అభ్యర్థి 140 ఓట్లతో గెలుపు
25వార్డు
జనసేన:- దేవూరు. శ్రీలక్ష్మి : 602 ఓట్లు
వైసీపీ :- మంచి.భారతి :148 ఓట్లు
25 వ వార్డు జనసేన అభ్యర్థి 494 ఓట్లతో గెలుపు
26వార్డు
టీడిపి:- నిండిగుంట.శ్రావణి :488 ఓట్లు
వైసీపీ :- అడిపూడి.అలివేలమ్మ
26వ వార్డు టిడిపి అభ్యర్థి 253 ఓట్లతో గెలుపు...
27వార్డు
టీడిపి:- ఆత్మకూరు.మల్లికార్జున : గెలుపు 554 ఓట్లు
వైసీపీ :- తోనేటి.శేఖరయ్య :457 ఓట్లు
27వ వార్డు టిడిపి అభ్యర్థి గెలుపు...
28వార్డు
టీడిపి చలంచర్ల.శ్రీదేవి :గెలుపు 518 ఓట్లు
వైసిపి :- ఎల్లంపల్లి. శ్రీనివాసులు :339 ఓట్లు 28
28వార్డ్ టిడిపి అభ్యర్థి గెలుపు...
మొత్తం వార్డులు...
28టిడిపిఏకగ్రీవమైనది...05 వార్డులు
టిడిపి ...14 (ఏకగ్రీవంతో పాటు టిడిపి 19)
జనసేన....03
బిజెపి...01
వైసీపీ ...04 వార్డులు గెలుపు
బుచ్చిరెడ్డిపాలెం మునిసిపల్ చైర్ పర్సన్ గా దొడ్ల విజయలక్ష్మి
బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్ పర్సన్ గా టిడిపికి చెందిన దొడ్ల విజయలక్ష్మి ఎన్నికయ్యారు. ఆమె తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి షేక్ షకీలాబేగంపై సుమారు ఎనిమిది వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు తనపై నమ్మకం ఉంచి టికెట్ను కేటాయించారని వారి నమ్మకం వమ్ముకానికుండా మునిసిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తాన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

చిటత్తూరు ఎంపీటీసీ సెగ్మెంట్‌లో జనసేనకు బ్రహ్మరథం

- స్థానిక అభ్యర్థి యానాది మణికి ప్రజల మద్దతు.. దండి నరేంద్ర

శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, నవంబర్ 03:
తొట్టంబేడు మండలం చిటత్తూరు ఎంపీటీసీ సెగ్మెంట్‌లో జనసేన పార్టీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. చిటత్తూరు, కారకొల్లు, దొంగలముడూరు, శివనాథపాలెంగ్రామాల్లోజనసేన నాయకులు,జనసైనికులు,వీర మహిళలతో కలిసి నియోజకవర్గ సమన్వయకర్త దండి నరేంద్ర ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా జనసేన బలపరిచిన స్థానిక ఎంపీటీసీ అభ్యర్థి యానాది మణికి గాజు గ్లాసు గుర్తుపై, టీడీపీ బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థి రావెళ్ల మునిరాజా నాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.



స్థానికుడైన యానాది మణి అభ్యర్థిత్వాన్ని ప్రజలు మనస్ఫూర్తిగా స్వాగతిస్తూ మద్దతు తెలుపుతున్నారనిదండినరేంద్ర పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేసిన జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, చిటత్తూరు ఎంపీటీసీ సెగ్మెంట్ ప్రజలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సమిష్టి కృషితో జనసేన ఎంపీటీసీ, టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థులనుఅఖండమెజారిటీతో గెలిపించాలనిదండినరేంద్ర పిలుపునిచ్చారు.

విజయవాడ ఈస్ట్‌లో వంగవీటి రాధాకృష్ణకు ఓట్ల వరద..సుంకర రమేష్

విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 03,
విజయవాడ నగర మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణకు విజయవాడ ఈస్ట్ పరిధిలో భారీగా ఓట్లు పోలైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈస్ట్ నియోజకవర్గంలో ప్రతి ఐదు ఓట్లలో నాలుగు ఓట్లు ఆయనకు అనుకూలంగా నమోదైనట్లు తెలుస్తోంది. ప్రజల్లో రాధాకృష్ణకు ఉన్న ఆదరణ, విశ్వాసం ఈ ఓట్ల సరళిలో స్పష్టంగా కనిపిస్తున్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.
విజయవాడ నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్ల రాధాకృష్ణకు ఉన్న నిబద్ధతకు ప్రజలు తమ ఓట్ల రూపంలో మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. ఈస్ట్ ప్రాంతంలో ఆయనకు లభించిన భారీ ఆదరణ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా వంగవీటి రాధాకృష్ణకు సుంకర రమేష్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.
ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ భారీ మద్దతు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రజల ఆశీస్సులతో విజయవాడ నగర అభివృద్ధికి రాధాకృష్ణ మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.
విజయవాడ ఈస్ట్‌లో రాధాకృష్ణకు లభించిన



ఈ ప్రజా మద్దతు శుభపరిణామమని, భవిష్యత్తులో ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని సుంకర రమేష్ అభినందనలు తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సాధారణ పరిశీలకురాలు నాగలక్ష్మి.ఎస్,

విజయవాడ, పెన్ పవర్,నవంబర్ 3:
ఎన్టీఆర్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా,నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల సాధారణ పరిశీలకురాలు నాగలక్ష్మి.ఎస్, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు.
మంగళవారం జగ్గయ్యపేట మున్సిపాలిటీకి సంబంధించి ఎస్.జి.ఎస్ కళాశాలలో, విజయవాడ నగరపాలక సంస్థకు సంబంధించి ఆంధ్ర లయోలా కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియతో పాటు భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు ఉండాలని, ప్రతి రౌండ్ ఓట్ల లెక్కింపులో ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు, మూడంచెల భద్రతను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
కౌంటింగ్ హాళ్లలో సీసీటీవీ నిఘా, నిరంతర విద్యుత్ సరఫరా, కంప్యూటర్ల పనితీరు, ఏజెంట్ల సీటింగ్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేస్తూ ఫలితాలను ఖచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు.
ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సాధారణ పరిశీలకురాలు నాగలక్ష్మి.ఎస్ ఆదేశించారు ఈ తనిఖీల్లో సంబంధిత మున్సిపల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు నవంబర్ 4న ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు సెలవు కలెక్టర్ జి. లక్ష్మీశ

విజయవాడ: పెన్ పవర్,నవంబర్ 3,
మురసు తుఫాన్ తీరం దాటిన అనంతరం ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని నవంబర్ 4వ తేదీ బుధవారం జిల్లావ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.లి
ఈ మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు వర్తిస్తుందని స్పష్టం చేశారు. సంబంధిత యాజమాన్యాలు, అధికారులు ఈ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.
భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులు, చిన్నారుల భద్రతకుఅత్యంత ప్రాధాన్యతఇవ్వాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు పంపవద్దని సూచించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలు, కాలువలు, చెరువులు, నీటి ప్రవాహాలు ఉన్న ప్రాంతాల వద్దకు పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలు, ఆదేశాలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనించాలని, అధికారులకు సహకరిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

తుఫాను ముప్పు ప్రాంతాల్లో ఎమ్మెల్యే మాలకొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పర్యటన

- ప్రజల భద్రతకు ప్రాధాన్యత.. ప్రత్యేక బస్సుల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలింపు

చీరాల నవంబర్ 3 (పెన్ పవర్) :
తుఫాను ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, జిల్లా ఎస్పీ పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. తుఫాను ప్రభావంతో ప్రమాదం ఎదురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రజల రక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ధైర్యం చెప్పారు.



అధికారుల సమన్వయంతో ప్రజలను ప్రత్యేక బస్సుల్లో పునరావాస కేంద్రాలకు సురక్షితంగా తరలించే ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మురసు తుఫాను ఒకవైపు.. మున్సిపల్ కౌంటింగ్ వేడి మరోవైపు

పెన్ పవర్, నవంబర్ 03

మాచర్ల పట్టణంలో మురసు తుఫాను ఒకవైపు హోరెత్తిస్తుంటే.. మరోవైపు మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ వేడి పట్టణాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రకృతి తుఫాను ప్రభావం ఒకవైపు.. రాజకీయ మెజార్టీ ఉత్కంఠ మరోవైపు.. మురసు మాచర్లలో మంగళవారం వాతావరణం హాట్‌హాట్‌గా మారింది.కౌంటింగ్ కేంద్రం వద్ద అభ్యర్థులు, అనుచరులు మెజార్టీ లెక్కలతో చెమటలు కక్కుతుంటే.. పట్టణంలోని ఇళ్లల్లో మాత్రం మసాలా ఘుమఘుమలు మరో రకమైన వేడిని రగిలిస్తున్నాయి. ఎన్నికల ఫలితాల ఉత్కంఠకు తోడు వంటింట్లో మాంసం వంటకాల సందడి కనిపిస్తోంది.ఇక మందుబాబుల పరిస్థితి మరీ విచిత్రం! మద్యం దుకాణాలు తెరుచుకునే సమయం కోసం ఎదురుచూస్తూ..

ఐదు గంటల వరకు ఆగాలంటే నరాలుతెగిపోతున్నాయంటూకొందరువాపోతున్నా రటఎన్నికలఫలితాలకంటేమద్యంకోసంఎదురుచూ పులే వారికి పెద్ద పరీక్షగా మారినట్లు కనిపిస్తోంది. మరోవైపు మాంసం దుకాణాలుతెల్లవారుజాము నుంచేకిటకిటలాడుతున్నాయి. కౌంటింగ్ రోజు కావడంతో మాంసం కొనుగోళ్లకు జనం పోటెత్తుతున్నారు. దుకాణాల వద్ద రద్దీ చూస్తుంటే ఎన్నికల సందడి వంటింటి వరకు చేరినట్లే కనిపిస్తోంది.మొత్తానికి మాచర్లలో మురసు తుఫాను మేఘాలు కమ్ముకుంటుంటే.. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ రాజకీయ వేడి రాజేస్తోంది.



కౌంటింగ్ కేంద్రం వద్ద మెజార్టీ మంటలు. మందుబాబుల ఎదురుచూపులు.. మాంసం దుకాణాల సందడి.. ఇలా మాచర్లలో మంగళవారం వాతావరణం తుఫాను కంటే తక్కువేమీ కాదు!

ముధోల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పిస్తాం-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



పెన్ పవర్, నవంబర్ 03

ముధోల్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో (సీహెచ్‌సీ) వైద్య సేవలను మరింత మెరుగుపరిచి, రోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు.
మంగళవారం ఆయన ముధోల్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది సంఖ్య, ప్రతిరోజూ చికిత్స కోసం వస్తున్న రోగుల వివరాలు, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం రక్త పరీక్షల గది, మందుల పంపిణీ కేంద్రం తదితర విభాగాలను పరిశీలించి, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.
ఆసుపత్రి భవనం పాతదైనందున అవసరమైన మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఆసుపత్రిలో మార్చురీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి సంబంధించి ఉన్నతాధికారులతో సంప్రదించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.
ఈ తనిఖీలో డీసీహెచ్ఎస్ కాశీనాథ్, తహసీల్దార్ శ్రీలత, సర్పంచ్ షబానా బేగం, ఇతర అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాసర ప్రతిష్టను దెబ్బతీయొద్దు.. అభివృద్ధికి సహకరించండి - డీసీసీ ఉపాధ్యక్షుడు మమ్మాయి రమేష్

పెన్ పవర్, నవంబర్ 03

గత పాలకుల నిర్లక్ష్యంతోనే బాసర ఆర్జీయూకేటీ అధ్వాన్నం, సీఎం రేవంత్ రెడ్డి చొరవతో గాడిన పడుతున్న ట్రిపుల్ ఐటీ
పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ ఆలయంతో పాటు బాసర ట్రిపుల్ ఐటీ (RGUKT) ప్రతిష్టను దెబ్బతీసేలా కొందరు సోషల్ మీడియా గ్రూపుల్లో, పత్రికల్లో అసత్య ప్రచారాలు చేయడం సరికాదని నిర్మల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు మమ్మాయి రమేష్ హితవు పలికారు.
మంగళవారం బాసరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో మారుమూల ప్రాంతమైన బాసర అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ట్రిపుల్ ఐటీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆ రోజుల్లో తాము సర్పంచ్‌గా, నారాయణరావు పటేల్ ఎమ్మెల్యేగా, వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉండి ఎంతో శ్రమకోర్చి, భూసేకరణకు సహకరించి, కేసులు కూడా భరించి ఈ సంస్థకు పునాది వేశామని భావోద్వేగంగా పేర్కొన్నారు.
దాదాపు 9 వేల మంది విద్యార్థులు, 2000 మంది సిబ్బంది, వేల మంది నిరుద్యోగుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ విశ్వవిద్యాలయాన్ని గత పదేళ్ల పాలకుల నిర్లక్ష్యం, నాటి వీసీ వెంకటరమణ వైఖరి వల్ల జూనియర్ కళాశాల కంటే అధ్వాన్నంగా మార్చేశారని మండిపడ్డారు.

గాడిన పడుతున్న యూనివర్సిటీ.. సీఎం రేవంత్ రెడ్డి చొరవ అమోఘం..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని రమేష్ తెలిపారు.



ఉస్మానియా, జేఎన్‌టీయూ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవజ్ఞుడైన ప్రొఫెసర్ గోవర్ధన్ గారిని బాసర ట్రిపుల్ ఐటీ వైస్ ఛాన్సలర్‌గా నియమించారని, ఆయన రాకతో ఇప్పుడిప్పుడే యూనివర్సిటీ గాడిన పడుతోందని హర్షం వ్యక్తం చేశారు.
ప్రొఫెసర్ గోవర్ధన్ అనుభవాన్ని గుర్తించే ప్రభుత్వం ఆయనను మహబూబ్‌నగర్ యూనివర్సిటీ వీసీగా కూడా నియమించిందని గుర్తు చేశారు. రాత్రి వేళల్లో మెస్సులు, హాస్టళ్లను స్వయంగా సందర్శించి విద్యార్థుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తున్న గొప్ప అధికారిపై బురదజల్లడం పద్ధతి కాదన్నారు. విద్యార్థులు సైతం ఆయన ఇక్కడి నుంచి వెళ్లొద్దని బతిమిలాడుకుంటున్న వీడియోలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

ఉద్యోగుల సంక్షేమంలో విప్లవాత్మక మార్పులు..

కొత్త వీసీ నాయకత్వంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని రమేష్ వివరించారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఒకటో తారీఖునే జీతాలు అందుతున్నాయని, కేవలం 200 రూపాయల వేతనంతో హాస్ కీపింగ్‌లో కూలిపని చేసుకునే 19 మంది సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. విద్యార్థుల ప్లేస్‌మెంట్ల కొరకు ఎన్నో కొత్త సంస్థలను తీసుకొస్తూ, క్రమశిక్షణతో యూనివర్సిటీని ఉన్నత స్థానానికి తీసుకెళ్లేందుకు వీసీ రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని చెప్పారు.

ప్రభుత్వాన్ని టార్గెట్ చేయడం మానుకోవాలి..

యూనివర్సిటీలో చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటిని భూతద్దంలో చూపిస్తూ పత్రికలకు, సోషల్ మీడియా గ్రూపులకు ఎక్కించడం వెనుక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని టార్గెట్ చేసే కుట్ర దాగి ఉందని మమ్మాయి రమేష్ ఆరోపించారు. ఇటీవల నీటి సమస్య తలెత్తితే విద్యార్థులకు సెలవులు ప్రకటించడాన్ని మీడియాలో పెద్ద ఎత్తున నెగెటివ్‌గా చూపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.
బాసర ఆలయానికి ₹54 కోట్లతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరింతగా అభివృద్ధి చేస్తోందని, రాబోయే రెండేళ్లలో బాసర ఆలయం, యూనివర్సిటీ తెలంగాణలోనే ప్రత్యేక స్థానంలో నిలవబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు.
ఏవైనా అంతర్గత సమస్యలు ఉంటే స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు, లేదా తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని, అంతేకానీ బాసర ప్రతిష్టను, ఉపాధిని దెబ్బతీసేలా అపోహలు సృష్టించవద్దని కోరారు. అలాగే చిన్న చిన్న కారణాల వల్ల పక్కన పెట్టిన కొందరు ఉద్యోగులను మానవీయ కోణంలో తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వీసీని కోరనున్నట్లు వెల్లడించారు. బాసర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జాదవ్ శీను పటేల్, అశోక్, గురప్ప, శంకర్, భోజన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలలో అలసత్వాన్ని సహించేది లేదు కలెక్టర్





- పారదర్శక రెవిన్యూ పాలన లక్ష్యంగా తాసిల్దారు చిత్తశుద్ధితో పని చేయాలి

పెన్ పవర్, నవంబర్ 03

రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూభారతి రీ సర్వే లక్ష్యంభూముల రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదు భూ సర్వే వివరాలు పరిశీలనలో నిర్లక్ష్యం ధోరణితో వ్యవహరిస్తున్న వెల్దుర్తి తాసిల్దార్ పై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నుఆదేశించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్
తాసిల్దార్ లో క్షేత్రస్థాయిలో ఉండాలి మీ మండలాల్లో సర్వే పై సమగ్ర అవగాహనతో ఉండాలి
రెవెన్యూ పరమైన అంశాలలో ప్రతి అంశాన్ని తాసిల్దార్లు బాధ్యతాయుతంగా పరిష్కరించాలి.
కలెక్టర్ ప్రతిమ సింగ్
రెవెన్యూ సేవలలో అలసత్వాన్ని సహించేది లేదని పారదర్శక రెవిన్యూ పాలన లక్ష్యంగా తాసిల్దారు చిత్తశుద్ధితో పని చేయాలి భూముల రీ సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యాన్ని వీడాలని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ తాసిల్దారులను హెచ్చరించారు.
మంగళవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్లో భూధార్, ల్యాండ్ రీ సర్వే, ధాన్యం కొనుగోలు, త్రిబుల్ ఆర్ , ప్రజావాణి పెండింగ్ సమస్యలు, సంబంధిత రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు తాసిల్దారులతో కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

జిల్లాలో రెవెన్యూ పరమైన అంశాలలో పక్కా ప్రణాళికతో పారదర్శక రెవిన్యూ పాలన లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. రెవెన్యూ సేవలలో ఆలస్యాన్ని సహించేది లేదని, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.. భూముల సమగ్ర రీ-సర్వే భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మరియు భూ రికార్డుల్లో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియను మెదక్ జిల్లాలో క్షేత్రస్థాయిలో పటిష్టంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. -సర్వే లక్ష్యాలు, ప్రక్రియ, రైతులకు కలిగే ప్రయోజనాలను గ్రామస్థులకు వివరించి వారి సహకారం పొందాలని సూచించారు.భూ రీ సర్వే విషయంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించేటప్పుడు తప్పనిసరిగా రైతులకు ముందస్తు సమాచారం అందించి, వారి సమక్షంలోనే సరిహద్దుల గుర్తింపు జరపాలి. అని చెప్పారు.విధుల్లో నిర్లక్ష్యం వహించే తాసిల్దారుల దగ్గర నుండి మండల సర్వేయర్లు లేదా లైసెన్స్‌డ్ సర్వేయర్లపై కఠిన చర్యలు ఉంటాయని, అవసరమైతే సస్పెన్షన్ వేటు వేస్తామని హెచ్చరించారు.
ఆధార్ కార్డు తరహాలోనే ప్రతి భూభాగానికి 12 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య అయిన భూదార్ నెంబర్ను కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు
రీ-సర్వే ఆధారంగా భూదార్ నెంబర్, ల్యాండ్ బేస్డ్ మ్యాప్ (ఎల్ బి ఎం) అనుసంధానం చేయడం ద్వారా భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఫోర్జరీలకు తావులేకుండా పక్కాగా రికార్డులు రూపొందుతాయని స్పష్టం చేశారు.
పెండింగ్ కోర్టు కేసులు - రెవెన్యూ వివాదాలు వివిధ కోర్టుల్లో మరియు ట్రిబ్యునళ్లలో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల కేసులకు సంబంధించి రెవెన్యూ అధికారులు తగిన రికార్డులతో కౌంటర్ అఫిడవిట్లను సకాలంలో దాఖలు చేయాలని ఆదేశించారు.
ముఖ్యంగా అటవీ మరియు రెవెన్యూ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు ఉన్న భూములపై జాయింట్ ఫీల్డ్ సర్వేలు నిర్వహించి, శాస్త్రీయ పద్ధతిలో సరిహద్దులను ఖరారు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న అర్హులైన పేదలకు జీవో 59 కింద ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. క్షేత్రస్థాయి పరిశీలనను క్షుణ్ణంగా పూర్తి చేసి, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా నిజమైన లబ్ధిదారుల దరఖాస్తులను మాత్రమే ఆమోదించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో తహసీల్దార్లు నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ, నిర్దేశిత గడువులోగా రీ-సర్వే మరియు రికార్డుల ప్రక్షాళన పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సర్వే ద్వారా ప్రతి భూమికి భూదార్ నంబర్ కేటాయించడంతోపాటు ఎల్‌బీఎం ద్వారా భూముల హక్కులు, సరిహద్దులకు స్పష్టత ఏర్పడుతుందని తెలిపారు. భూములు రి సర్వే జరిగేటప్పుడు తాసిల్దార్లు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి
సర్వే టీమ్స్ సర్వే చేస్తున్న విధానాన్ని
తప్పనిసరిగా పరిశీలించాలని భూముల రీ సర్వే రైతుల సమక్షంలోనే చేపట్టే విధంగా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలనకు వెళ్ళినప్పుడు వెల్దుర్తి మండల తాసిల్దార్ సర్వే నిర్వహణ
తీరు తెలియకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్ ను ఆదేశించారు.సర్వే సెటిల్‌మెంట్ తర్వాత భూముల క్రయ విక్రయాలు పారదర్శకంగా సాగేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. సర్వే పూర్తయిన తర్వాత పట్టాదారు పాసుపుస్తకాలు, పహాణీ పత్రాలు మరింత... సులభం అవుతాయని చెప్పారు. అంతకుముందు భూధార్ ,రీ సర్వే ప్రక్రియపై క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అనుభవాలను వారి మాటలలో స్వయంగా తెలుసుకున్నారు.
ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం జీవో 59 కింద వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. దరఖాస్తుదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి, అనర్హుల చేతుల్లోకి ప్రభుత్వ భూములు పోకుండా జాగ్రత్త వహించాలని, నివేదికలను త్వరగా సమర్పించాలని తహసీల్దార్లను ఆదేశించారు.
ప్రజల నుంచి వచ్చే భూ సంబంధిత ఫిర్యాదులపై తహసీల్దార్లు తక్షణమే స్పందించాలని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రెవెన్యూ యంత్రాంగం జవాబుదారీతనంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజావాణి పెండింగ్ సమస్యలపై ప్రతిఘటన పరిష్కరించాలన్నారు, త్రిబుల్ ఆర్
సమస్యలపై తాసిల్దార్లతో రివ్యూ నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని ప్రస్తుతం జిల్లాలో
530 సెంటర్లు ప్రారంభించాల్సి ఉండగా 280 సెంటర్స్ ప్రారంభించామన్నారు 14 సెంటర్ల నుండి 412 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు.ల్యాండ్ అక్విజిషన్‌లక్ష్యాలను పూర్తి చేయాలి అన్నారుఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ ట్రైనీ కలెక్టర్ మహమ్మద్‌శ్రీఅహ్మద్, ఏడి ల్యాండ్ సర్వే కిషన్, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ రామకృష్ణ, తూప్రాన్ బావయ్య, సంబంధిత తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
పెన్ పవర్, నవంబర్ 03

భూముల రీ సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, పకడ్బందీగా నిర్వహించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.
మంగళవారం ముధోల్ మండలం చందాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మొత్తం పట్టా భూముల విస్తీర్ణం, సాగునీటి వసతులు ఉన్న భూములు, ఇతర భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.
భూముల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు





తావులేకుండా భూ హద్దులను కచ్చితంగా గుర్తించాలని సూచించారు. భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ రీ సర్వే చేపట్టాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.
ఈ పరిశీలనలో తహసీల్దార్ శ్రీలత, సర్వే అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హరిజనాపురంలో ఉపాధి హామీ ఫార్మ్ పాండ్ నిర్మాణానికి శంకుస్థాపన



పెన్ పవర్, నవంబర్ 03

చింతపల్లి మండలంలోని హరిజనాపురం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) కింద మంజూరైన నూతన ఫార్మ్ పాండ్ రైతు కుంట నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు.
గ్రామానికి చెందిన రైతు కాటిక లక్ష్మమ్మకు చెందిన వ్యవసాయ భూమిలో ఈ ఫార్మ్ పాండ్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, సహాయ ప్రాజెక్టు అధికారి (ఏపీఓ) శౌరి రెడ్డి, సాంకేతిక సహాయకులు (టీఏ), గ్రామ సర్పంచ్ తంగేళ్ళ రామకృష్ణ, ఉపసర్పంచ్, గ్రామ వార్డు సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వర్షపు నీటిని వ్యర్థంగా పోనివ్వకుండా నిల్వ చేసుకోవడానికి, పరిసర ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాన్ని గణనీయంగా పెంచడానికి ఈ ఫార్మ్ పాండ్ నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. రాబోయే పంట కాలంలో నీటి ఎద్దడిని తట్టుకుని, పంటలకు సమృద్ధిగా నీరు అందించేందుకు ఈ నిర్మాణం స్థానిక రైతులకు ఎంతో మేలు చేకూరుస్తుందని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా లభించే ఇటువంటి అవకాశాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు వేతనదారులు పాల్గొన్నారు.

కౌతవరంలో కూటమి విజయం ఖాయం...

పెన్ పవర్, నవంబర్ 03

కౌతవరంలో కూటమి విజయం ఖాయమని సాగునీటి డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కౌతవరం 1, 2 టీడీపీ ఎంపీటీసీ సెగ్మెంట్ల అభ్యర్థులు యార్లగడ్డ కల్యాణి, కంచర్ల ప్రకాష్(పాము) మంగళవారం ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు తమతో పాటు జెడ్పీటీసీ అభ్యర్థి వర్రే బలరామకష్ణకు గాజుగ్లాసు గుర్తుకు ఒక్కో ఓటరు రెండేసి ఓట్లను వేయవలసిందిగా అభ్యర్థించారు. అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొబ్బరి బొండాల మాటున 08 పశువుల అక్రమ రవాణా.

పెన్ పవర్, నవంబర్ 03

మరిపెడ రాత్రి వేళల్లో మరిపెడ పోలీసులు నిర్వహిస్తున్న పెట్రోలింగ్‌లో పశువుల అక్రమ రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పెట్రోలింగ్‌లో ఉన్న మరిపెడ పోలీసు సిబ్బంది పీసీ నరేష్, పీసీ జి. శ్రీను అనుమానాస్పదంగా నంబర్ ప్లేట్ లేకుండా కొబ్బరి బొండాలతో వెళ్తున్న టాటా ట్రాలీ వాహనాన్ని గుర్తించి ఆపి తనిఖీ చేశారు.
ఈ తనిఖీల్లో వాహనంలో కొబ్బరి బొండాల మాటున కాళ్లు, మెడలకు తాళ్లతో కట్టివేసి కదలలేని స్థితిలో ఉంచిన 06 ఆవులు, 02 కోడెగిత్తలు, మొత్తం 08 పశువులను గుర్తించారు. పశువులను అమానుషంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.
ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లికి చెందిన గొర్ల శివ, యలమచిలీ శివ, బంగారి లచ్చన్న అనే ముగ్గురు నిందితులను గుర్తించారు. నిందితులు అనకాపల్లి ప్రాంతం నుంచి పశువులను సేకరించి, కొబ్బరి బొండాల మాటున హైదరాబాద్‌లోని



కబేళాలకు గత కొంతకాలంగా అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.

నకిలీ కస్టమర్ కేర్, పెట్టుబడి మోసాలు, స్క్రీన్ షేరింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,

పెన్ పవర్, నవంబర్ 03

"యువర్ మనీ , యువర్ క్లిక్ , యువర్ ఛాయస్ " నినాదంతో నవంబర్ నెల మొత్తం జిల్లా వ్యాప్తంగా సైబర్ అవగాహన కార్యక్రమాలు
సైబర్ నేరాల నివారణపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన జగిత్యాల జిల్లా ఎస్పీఅశోక్ కుమార్
సైబర్ ఆర్థిక నేరాలను అరికట్టి ప్రజల్లో సురక్షితమైన డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంపొందించేందుకు నవంబర్ నెల మొత్తం జగిత్యాల జిల్లా వ్యాప్తంగా "యువర్ మనీ , యువర్ క్లిక్ , యువర్ ఛాయస్ " అనే ప్రధాన ఇతివృత్తంతో, "పాస్ ది పేమెంట్ వెరిఫై ది పర్సన్ " అనే నినాదంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..
ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు నిత్యం కొత్త పద్ధతులను అనుసరిస్తూ ప్రజలను ఆర్థిక మోసాలకు గురిచేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని



సూచించారు. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించే ముందు క్షణం ఆగి, డబ్బులు స్వీకరించే వ్యక్తి లేదా సంస్థ వివరాలను పూర్తిగా ధృవీకరించుకోవాలని తెలిపారు.ముఖ్యంగా ఆన్‌లైన్ ప్రకటనల ద్వారా వస్తువులు, సేవలు అందిస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేసి వస్తువులు డెలివరీ చేయకుండా మోసాలకు పాల్పడటం, వ్యక్తిగత వివరాలను దొంగిలించి క్రెడిట్, డెబిట్ కార్డులను అనధికారికంగా వినియోగించడం, స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వస్తాయని ఆశ చూపుతూ నకిలీ పెట్టుబడి పథకాల పేరుతో మోసం చేయడం వంటి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
అదేవిధంగా నకిలీ కస్టమర్ కేర్ నంబర్లను నమ్మి సంప్రదించవద్దని, గూగుల్ లేదా సోషల్ మీడియాలో కనిపించే ప్రతి కస్టమర్ కేర్ నంబర్ నిజమైనదని భావించవద్దని తెలిపారు. అపరిచితుల సూచనల మేరకు స్క్రీన్ షేరింగ్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేయవద్దని, ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని స్పష్టం చేశారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, చెల్లింపుల సమయంలో లబ్ధిదారుల పేరు, ఖాతా వివరాలను సరిచూసుకోవాలని సూచించారు.
ఎవరైనా సైబర్ ఆర్థిక మోసానికి గురైనట్లయితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా షషష.సైబరక్రైమ్ .గోవ్ .ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలువరించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.
ఈ యొక్క కార్యక్రమం లో రిజర్వ్ ఇన్స్పెక్టర్ వేణు, సైబర్ క్రైమ్ ఎస్.ఐ కృష్ణ, ఫ్రెండ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న గోపాల్ కి అండగా మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం





- ఆపదలో ఉన్నవారికి అండగా...ప్రజల సమస్యే నా సమస్య...

పెన్ పవర్, నవంబర్ 03

కల్వకుర్తి పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న మేస్త్రీ గోపాల్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం గోపాల్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించి కుటుంబానికి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ తరఫున గోపాల్ కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ ఎండీ షాహెద్,బాలయ్య,ముజ్జు,నరసింహ,బాలయ్య యాదవ్,రాజు,జహంగీర్,బాలచంద్రయ్య,తదితరులు పాల్గొన్నారు.

బాలసదనాన్ని తనిఖీ చేసిన జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగశైలజ

- అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాలి
-జిల్లా ఐ సి డి ఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగ శైలజ

పెన్ పవర్, నవంబర్ 03

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగశైలజ మంగళవారం గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ రికార్డులను, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ
మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పోషకాహారం అందించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రీ-స్కూల్ విద్య కీలకమని, ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన నిర్వహించాలని తెలిపారు.





అలాగే కార్యాలయ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని సూచించారు.
అనంతరం గూడూరులోని బాలసదనాన్ని సందర్శించి అక్కడి వసతి సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రత, పిల్లలకు అందిస్తున్న భోజనం, విద్య, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలను పరిశీలించారు. బాలసదనంలో మొత్తం 35 మంది పిల్లలు ఉండగా, తనిఖీ సమయంలో 33 మంది హాజరయ్యారు.
ఈ సందర్భంగా పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడిన నాగశైలజ వారి చదువులు, ఆరోగ్యం, భోజనం, రోజువారీ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, సురక్షితమైన వాతావరణం కల్పించాలని సిబ్బందికి సూచించారు. పిల్లల అభివృద్ధి, భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.
ఈ తనిఖీ కార్యక్రమంలో గూడూరు ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్.కె. మెహబూబీ పాల్గొన్నారు.

మాచర్ల 5వ వార్డులో జనసేన జెండా.. 775 ఓట్లతో నక్షత్ర ప్రసాదు విజయం

పెన్ పవర్, నవంబర్ 03



మాచర్ల పురపాలక సంఘం 5వ వార్డుకు జరిగిన ఎన్నికల్లో జనసేన బలపరిచిన అభ్యర్థి నక్షత్ర ప్రసాదు ఘన విజయం సాధించారు.ఎన్నికల అధికారి ప్రకటించిన ఫలితాల ప్రకారం
ఈ వార్డులోని రెండు బూతుల్లో కలిపి మొత్తం 1001 ఓట్లు పోలయ్యాయి. అందులో జనసేన అభ్యర్థి నక్షత్ర ప్రసాదు (గాజు గ్లాసు గుర్తు) కు 775 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థి అభ్యర్థులకు 174 ఓట్లు, నోటా కు 41 ఓట్లు వచ్చాయి. 11 ఓట్లు చెల్లనివిగా ప్రకటించారు. రెండో స్థానంలో ఉన్న అభ్యర్థి కంటే 615 ఓట్లు ఎక్కువ సాధించి నక్షత్ర ప్రసాదు వార్డు కౌన్సిలర్ గా ఎన్నికయ్యారు. ఆయన విజయంతో జనసేన కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

మిడ్ లైన్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలి...

పెన్ పవర్, నవంబర్ 03







జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చీర్యాలలో జరుగుతున్న పాఠశాల సముదాయ సమావేశ కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులతో డీఈవో రేణుకా దేవి మాట్లాడుతూ పేద పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే దక్కుతుందని అట్టి అవకాశాన్ని సద్వినియోగం చేస్తూ విద్యార్థుల జీవితాన్ని తీర్చిదిద్దాలని తద్వారా వృత్తి గౌరవాన్ని నిలబెట్టాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం విజయవంతం కావడానికి ఉపాధ్యాయులు అందరూ పాత్రను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.
ఎఫ్ ఆర్ ఎస్ విషయంలో కూడా తగిన శ్రద్ధ వహిస్తూ విద్యార్థులు అందరూ సరైన సమయానికి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా బాధ్యత వహించాలని అలాగే ఉపాధ్యాయులు కూడా డీఎస్సీ ఎఫ్ ఆర్ ఎస్ తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు.
అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేర్యాలలో విద్యార్థులకు అందిస్తున్న రాగిజావను పరిశీలించి స్వయంగా విద్యార్థులకు వడ్డించి రుచి వివరాలను వంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు బాగా చదివి వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాంప్లెక్స్ హెడ్మాస్టర్ జి రవీందర్ ఆర్ పి లు జనార్దన్, అవినాష్, అశోక్, గోవర్ధన్ మరియు వివిధ పాఠశాలల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొలగవల్లి కొట్టాలలో తెలుగుదేశం జడ్పిటిసి అభ్యర్థి కొమ్ము రామాంజనేయులు విస్తృతంగా ప్రచారం చేశారు.

పెన్ పవర్, నవంబర్ 03

ఆలూరు మండలం పరిధిలోని మొలగవల్లి కొట్టాలలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ జడ్పిటిసి అభ్యర్థి కొమ్ము రామాంజనేయులు, ఎంపీటీసీ అభ్యర్థి శ్రీమతిగుమ్మల కీర్తి లాజర్ గడపగడపకు తిరుగుతూ విస్తృతంగా అభ్యర్థులకు రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేయమని అభ్యర్థిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ తమకు కేటాయించిన సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఆదరించి గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరికి శిరస్సు వంచి నమస్కరిస్తూ వినయపూర్వకంగా ఓట్లు అభ్యర్థించారు. గ్రామంలోని ప్రజలు యువత మహిళలు పెద్దలను కలుసుకొని వారి ఆదరాభిమానాలు కోరారు. ప్రజల సమస్యలను







తెలుసుకొని సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుపై మీ అమూల్యమైన రెండు ఓట్లు వేసి ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించి గ్రామాల అభివృద్ధికి మండలాభివృద్ధికి కృషి చేసే విధంగా మమ్ములను ఆశీర్వదించాలని వారు ఓటర్ దేవుళ్లను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కటారి కొండ శ్రీనివాసులు, జిల్లా టిడిపి ఎస్సీ సెల్ నాయకులు నరసప్ప, మసాలా జగన్, పెయింటర్ గోవిందు, ఉలగప్ప, మొలగవల్లి మాజీ సర్పంచ్ మోహన్ రాజు, ఎం కొట్టాల మాజీ సర్పంచ్ రాజశేఖర్, డీలర్ రామాంజనేయులు, కర్ణాంజనేయులు, ఆలూరు కిరణ్, ఐ టి డి పి జయరాజు, ఎన్ ప్రహ్లాద్, చంద్రమౌళి,ఎన్ శ్రీనివాసులు, పల్లి ఆనందు, రంగస్వామి, యూనిట్ అధ్యక్షులు షేక్షావలి, మాల నరసింహులు, కాజీ పురం ఏసేపు, కాజీ పురం యేసు రాజు, వండ్రప్ప, రేకుల బొజ్జప్ప, మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆలూరు కోటవీధిలో జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థి కిషోర్ చివరి రోజువిస్తృత ప్రచారం.

పెన్ పవర్, నవంబర్ 03







ఆలూరు స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో ఆలూరు పట్టణంలోని కోటవీధి తదితర ప్రాంతాలను జడ్పిటిసి స్వతంత్ర అభ్యర్థి బెంగళూరు కిషోర్ విస్తృతంగా పర్యటించి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. వీధుల్లో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను నేరుగా కలుసుకొని తనకు కేటాయించిన బ్యాట్ గుర్తుకు ఓటు వేసి అఖండతో గెలిపించాలని తనకు మద్దతు తెలిపి ఆశీర్వదించాలని ఓటరు దేవుళ్లను ప్రాధేయపడ్డారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడుతూ తనను స్వతంత్ర అభ్యర్థిగా ఆదరించి ఎన్నికల్లో బ్యాట్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తన అభ్యర్థిత్వాన్ని వివరించారు. ప్రచారానికి చివరి రోజు కావడంతో తన ప్రచారంలో భాగంగా కోటవీధిలో నిర్వహించిన పర్యటనలో ఆయనకు మద్దతుగా పలువురు అనుచరులు మద్దతుదారులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం గడువు ముగిసే వరకు ఓటర్లను కలుసుకుంటూ తన ప్రచారాన్ని కొనసాగించారు. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ పద్మవ్యూహం అనే ఈ ఎన్నికల బరిలో నేను నిలబడ్డాను ఓటరు దేవుళ్ళు పద్మవ్యూహం నుండి నన్ను బయటకు తీసుకు వస్తారనే నమ్మకం అపారంగా ఉంది. ప్రజల ఆశీర్వాదంతో నేను ఈ పద్మవ్యూహం నుండి సురక్షితంగా బయటకు తిరిగి వస్తాను నా ఓటరు దేవుళ్ళు రప్పిస్తారని నమ్మకం నాకు ఉందని ఆయన అన్నారు.

పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకోవాలి

పెన్ పవర్, నవంబర్ 03

కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు మట్టా మదన్ కుమార్ గౌడ్.పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు మట్టా మదన్ కుమార్ గౌడ్ కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకొని ఎన్నికల్లో బాధ్యతగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.
ఈ సందర్భంగా తహసీల్దార్ కార్తిక్ కుమార్ గారిని కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన బీఎల్వో ఫారమ్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు మట్టా విష్ణుగౌడ్, కుశా కుమార్, శశికుమార్, తానాషే యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర కరువు బృందం (ఐఎంసిటి) గ్రామాల సందర్శన

పెన్ పవర్, నవంబర్ 03

ఈరోజు ఐఎంసిటి కరువు బృందము పాములపాడు మండలంలోని, కృష్ణారావుపేట, ఎర్రగూడూరు గ్రామాలను సందర్శించడం జరిగింది.
ఈ సందర్భంగా కేంద్ర అధ్యయన కరువు బృందం (ఐఎంసిటి) వారు మాట్లాడుతూ తదుపరి, రైతులతో ముఖాముఖి చర్చలు జరిపి తదుపరి ప్రభుత్వానికి నివేదిక సబ్మిట్ చేస్తామని తెలిపారు. ఆత్మకూరు



మండలంలో ఫొటోస్ ఎగ్జిబిషన్ పెట్టడం జరిగింది.
ఈ బృందంలో నంద్యాల కలెక్టర్ జి.రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మరియు జిల్లా వ్యవసాయ అధికారితో పాటు జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, కె.హేమలత గారితోపాటు మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొనడం జరిగింది.

అనారోగ్యంతో భజన కళాకారుడు చింతాజీ కృష్ణమాచారి మృతి

పెన్ పవర్, నవంబర్ 03



వంగూరు మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక కార్యకర్త, గ్రామానికి చెందిన ప్రముఖ భజన కళాకారుడు చింతోజీ కృష్ణమాచారి (65) మంగళవారం మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ, హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు చనిపోయాడు. కృష్ణమాచారికి ముగ్గురు పిల్లలు భార్య ఉన్నారు. కృష్ణమాచారి మృతి పట్ల గ్రామస్తులు సంతాపం తెలిపారు. చురుగ్గా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేవారని గుర్తు చేసుకున్నారు.

పాఠశాలలో మురుగు నీటి నిల్వ తరలింపునకు ప్రత్యేక చర్యలు





పెన్ పవర్, నవంబర్ 03

మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల ఆవరణలో మురుగు నీరు చేరుతోంది. పాఠశాల ముందున్న డ్రైనేజీలో ముందుకు వెళ్లడం పోవడంతో మురుగు నీరు ప్రవహిస్తుంది. దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు పెరిగి అనారోగ్యాలు కలిగే ప్రమాదం ఉందని అధికారుల దృష్టి తీసుకెళ్లారు. అయితే సమీపనా ఆనుకొని ఉన్న పంట పొలాల రైతుల పంట పొలాలకు మురుగు నీరు చేరుతుండటంతో మురుగు నీరు రాకుండా అడ్డుకట్ట వేయడంతో సమస్య ఉత్పన్నమైంది. ఈ మేరకు మంగళవారం గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఎంపీడీవో సులోచన, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రవంతి లు కలిసి మురుగు నీరు నిల్వ గుంత వద్ద పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... విద్యార్థుల ఆరోగ్యం మరియు పరిశుభ్రత దృష్ట్యా శాశ్వత పరిష్కారం చూపడానికి పంట పొలాలకు వెళ్లకుండా, అంతర్గత కాలువలను నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లింగయ్య, పంచాయతీ కార్యదర్శి గిరి, వార్డు సభ్యులు కిస్టల్, వెంకటేష్, మారపల్లి మంజుల శ్రీను, నాయకులు రషీద్, మట్ట భరత్ గౌడ్, కొండల్, పాఠశాల ఉపాధ్యాయులు తదితర నాయకులు ఉన్నారు.

రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదర్శ ఉపాధ్యాయులు శ్యామల, కవితలను సన్మానించిన మండల విద్యాధికారి రాఘవులు

పెన్ పవర్, నవంబర్ 03



ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తూ తమ పిల్లలను కూడా తమ వెంట తాము పని చేసే పాఠశాలకు తీసుకెళ్తూ అందరికీ ఆదర్శంగా నిలిచినటువంటి ఉపాధ్యాయులు ఏన్ .శ్యామల మరియు పి .కవిత మరొక ఉపాధ్యాయునికి ఎస్ జి టీ యూ రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదర్శ ఉపాధ్యాయులు గా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాఘవులు జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటరమణి రాయికల్ మండల శాఖ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రాజేష్ మరియు ఇతర సంఘ బాధ్యులు పాల్గొన్నారు...

ఎంపీపీ అభ్యర్థి కాగితకే మన ఓట్లు...

పెన్ పవర్, నవంబర్ 03



గుడ్లవల్లేరు మండల అభివద్ధి కాంక్షించే టీడీపీ ఎంపీపీ అభ్యర్థి కాగిత ఉమకే ఓట్లు వేయాలని పురిటిపాడు ఎంపీటీసీ సెగ్మెంట్ ఓటర్లు కోరుకుంటున్నారు. పురిటిపాడు సెగ్మెంట్‌లో టీడీపీ అభ్యర్థి ఉమ మంగళవారం ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు తనతో పాటు జెడ్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకష్ణకు గాజుగ్లాసు గుర్తుకు రెండు ఓట్లను అభ్యర్థించారు. సంక్షేమంతో పాటు అభివద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కాగిత నరేంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరాడ అభివద్ధి కల్యాణపు నవాబుకే సాధ్యం...



పెన్ పవర్, నవంబర్ 03

కూరాడ గ్రామాభివద్ధి జనసేన ఎంపీటీసీ అభ్యర్థి కల్యాణపు నవాబుకే సాధ్యమని ఆ ఎంపీటీసీ సెగ్మెంట్ ప్రజలు అంటున్నారు. కూరాడ సెగ్మెంట్‌లో జనసేన అభ్యర్థి నవాబు మంగళవారం ఇంటింటికీ తిరిగి గాజు గ్లాసు గుర్తుకు తనతో పాటు జెడ్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకష్ణకు గాజు గ్లాసు గుర్తుకు రెండు ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో శ్రీ కొండలమ్మ ఆలయ చైర్మన్ ఈడే మోహన్, కూటమి నాయకులు బాసా రాంబాబు, శీరం రమేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు - వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తి



పెన్ పవర్, నవంబర్ 03





రానున్న వేసవిలో నిర్మల్ పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తెలిపారు.

పట్టణానికి తాగునీరు అందించే ఎస్సార్ఎస్పీ ప్రాజెక్టును ఆయన అధికారులతో కలిసి శనివారం సందర్శించి, ప్రస్తుత నీటి నిల్వలు, వేసవిలో నీటి సరఫరా పరిస్థితిపై సమీక్షించారు.

ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ..

ప్రస్తుత నీటి మట్టాన్ని పరిశీలిస్తే పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలిగే అవకాశాలు లేవని, వేసవి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉందని తెలిపారు. ఒకవేళ అనుకోని పరిస్థితుల్లో నీటి నిల్వలు తగ్గినప్పటికీ, ఆ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించినట్లు పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని సూచించారు. తాగునీటి పైపులైన్లలో లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా నీటి లీకేజీలు గుర్తిస్తే వెంటనే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నీటి వృథాను అరికట్టేందుకు ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట కౌన్సిలర్లు గోపు గోపి, పెండం శ్రీనివాస్, నాందేడపు చిన్ను, రఫీ, చెనిగరపు నరేష్, జకి, శ్రీకాంత్ యాదవ్, డీఈ హరిభువన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య సేవకుడు ఫణిబాబుదే గెలుపు...

పెన్ పవర్, నవంబర్ 03



అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే నిత్య సేవకుడు టీడీపీ అంగలూరు ఎంపీటీసీ అభ్యర్థి చిలుముల ఫణిబాబుదే గెలుపు అని ఆ సెగ్మెంట్ ఓటర్లు అంటున్నారు. అంగలూరు సెగ్మెంట్‌లో టీడీపీ అభ్యర్థి ఫణిబాబు మంగళవారం ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు తనతో పాటు జెడ్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకష్ణకు గాజుగ్లాసు గుర్తుకు రెండు ఓట్లను అభ్యర్థించారు. సంక్షేమంతో పాటు అభివద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు దుగ్గిరాల శేషుబాబు, లింగం చిట్టిబాబు, రాజు, మెరుగుమాల సుబ్రహ్మణ్యం(బాలు), నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముధోల్ నుంచి 15 వేల మందితో నిర్మల్ మహా పాదయాత్రకు తరలింపు - ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ నేతృత్వంలో భారీ జనసమీకరణ

పెన్ పవర్, నవంబర్ 03



ముధోల్ నియోజకవర్గం నుంచి నిర్మల్ లో జరుగుతున్న బీజేపీ మహా పాదయాత్రకు భారీ జనసమీకరణ జరిగింది.

ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి సుమారు 15 వేల మంది కార్యకర్తలు, నాయకులు ప్రత్యేక వాహనాల్లో నిర్మల్ కు బయలుదేరి వెళ్లారు.

నిర్మల్ జిల్లా కేంద్రంలో బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్న బీజేపీ మహా పాదయాత్ర ప్రతిష్ఠాత్మకంగా జరుగుతోంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే లక్ష్యంగా ఈ పాదయాత్ర చేపట్టారు.

ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి - ఎమ్మెల్యే

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ..

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం బోగస్ ఓట్లను తొలగించి పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించే ప్రక్రియ చేపడుతుంటే కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. బోగస్ ఓట్లతో గెలవాలనే కుట్రలో భాగంగానే కాంగ్రెస్ ఎస్ఐఆర్ ను వ్యతిరేకిస్తోంద విమర్శించారు.బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి సునీల్ బన్సల్ ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఈ మహా పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అన్ని మండలాల నుంచి భారీ తరలింపు..

ముధోల్ నియోజకవర్గం నుంచి బాసర, తానూర్, ముధోల్, కుబీర్, భైంసా, లోకేశ్వరం, కుంటాల మండలాల నుంచి బీజేపీ శ్రేణులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ముధోల్ నుంచి బయలుదేరిన వాహనాలకు ఎమ్మెల్యే పవార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

:ఇంటింటికీ సేవ కాసాని సుబ్బయ్య వారసులకే సాధ్యం...



- సాంప్రదాయ పద్ధతిలో సన్నాయి మేళాలతో వినూత్న ప్రచారం..

పెన్ పవర్, నవంబర్ 03

గుడ్లవల్లేరు 1 సెగ్మెంట్‌లో ఇంటింటికీ సేవ చేయాలంటే కాసాని వారసులకే సాధ్యమని, దిగుమతైన నాయకులకు ఆ సేవ సాధ్యం కాదని ఆ ప్రాంత ఓటర్లు అంటున్నారు. కాసాని సుబ్బయ్య కుమార్తె, గుడ్లవల్లేరు 1 స్వతంత్ర్య అభ్యర్థి కాసాని మౌనిక సాయిని హార్మనియం పెట్టెకు ఓటు వేసి గెలిపిద్దామని సెగ్మెంట్ ఓటర్లు కోరుతున్నారు. మౌనిక సాయి మంగళవారం ఇంటింటికీ తిరిగి ఓట్లను అభ్యర్థించారు. సాంప్రదాయ పద్ధతిలో ఈ అభర్థి మౌనిక చేసిన సన్నాయి మేళాలతో వినూత్న ప్రచారం ఆ ప్రాంత ఓటర్లను అందర్నీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కాసాని శ్రీరామ్, యార్లగడ్డ ఉమామహేశ్వరరావు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు, విద్యావేత్త గీకురు రవీందర్ 56వ వర్ధంతి ఘనంగా నిర్వహణ

పెన్ పవర్, నవంబర్ 03



తెలంగాణ ఉద్యమకారుడు, విద్యావేత్త, చిగురుమామిడి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్ గారి 56వ వర్ధంతిని ఆయన అనుచరులు,అభిమానులు, శ్రేయోభిలాషులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో, విద్యారంగంలో గీకురు రవీందర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలు, ప్రజాసేవ, సమాజ అభివృద్ధి కోసం చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో చెరుకు చిన్న సమయ్య (వార్డు సభ్యుడు), పోతర్ల శివాంజనేయులు (వార్డు సభ్యుడు), శిరవేణి సంపత్, బెజ్జంకి అంజయ్య, డాక్టర్ బొల్లి రమేష్, పెసరి శ్రీనివాస్, చొప్పదండి సాయి కుమార్, భాషవేణి రమేష్, బెజ్జంకి జాక్స్, గుజ్జుల రాజు, వేల్పుల పరశురాములు, జయంత్, యెడల శివ, పొన్నం శేఖర్, బెజ్జంకి శేఖర్, మల్లం సతీష్, మల్లం అక్షిత్, పొన్నం రాజు, కొమ్ముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి అనిల్ గెలుపు ఖాయం..

పెన్ పవర్, నవంబర్ 03



వడ్లమన్నాడు ఎంపీటీసీ సెగ్మెంట్‌లో టీడీపీ అత్యధిక మెజార్టీతో గెలుపొందటం ఖాయమని ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. వడ్లమన్నాడు టీడీపీ ఎంపీటీసీ సెగ్మెంట్ అభ్యర్థి పామర్తి నాగ అనిల్ మంగళవారం ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు తమతో పాటు జెడ్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకష్ణకు గాజుగ్లాసు గుర్తుకు ఒక్కో ఓటరు రెండేసి ఓట్లను వేయవలసిందిగా అభ్యర్థించారు. అన్ని వర్గాల ప్రజలను అభివద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు పెన్నేరు రమేష్‌బాబు, కూటమి నాయకులు తోట ప్రసన్నాంజనేయులు, పామర్తి సత్తిబాబు, బాబి, పెన్నేరు శేఖర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల ఎమ్మెల్యే డా" సంజయ్ కుమార్ కి లగ్నపత్రిక అందజేసిన బాధినేని దంపతులు

పెన్ పవర్, నవంబర్ 03

తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి వర్యులు అడ్డూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డా" సంజయ్ కుమార్ కి లగ్నపత్రిక అందజేసిన బాధినేని దంపతులు


ఈ నేల 15 తేదీన జగిత్యాల పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో జరగనున్న కుమారుడు వివాహ మహోత్సవానికి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి వర్యులు అడ్డూరి లక్ష్మణ్ కుమార్ కి మరియు జగిత్యాల నియోజకవర్గం శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ కి లగ్నపత్రికను అందజేశారు ఈ కార్యక్రమం లో వివిధ స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఈ పోలింగ్ ఫస్ట్ ఎపిసోడ్... ఏం నేర్పుతోంది.. !



తాజాగా జరిగిన స్థానిక సంస్థల పోలింగ్ ఒకరకంగా ఫస్ట్ ఎపిసోడ్‌గానే చూడాలి. ఎందుకంటే.. అన్ని పార్టీలకూ కీలకమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ముందున్నాయి. అయితే.. ఈ ఎన్నికల్లో వాస్తవ పోలింగ్ శాతం గతంతో పోల్చుకుంటే బాగా తగ్గుముఖంపట్టింది. 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో 69 శాతం మేరకు పోలింగ్ నమోదైంది. దీనితో పోల్చుకుంటే.. ఇప్పుడు సగటున 55 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. ఈ పరిణామాలు.. అన్ని పార్టీలకూ అనేక విషయాలను నేర్పుతున్నాయని అంటున్నారు విశ్లేషకులు.
నాయకుల మధ్య కలివిడి: ఏ పార్టీలో అయినా.. నాయకుల మధ్యకలివిడి ముఖ్యం. కూటమి పార్టీల్లో అధిష్టానాలు పదే పదే చెప్పినా.. ఈ తరహా కలివిడి లేని చోట చాలా వరకు ఓటింగ్ తగ్గిపోయింది. విశాఖ, విజయవాడ వంటి కీలక నగర పాలక సంస్థల పరిధిలో 50 శాతం ఓటు బ్యాంకు కూడా మించలేదు. దీనికి కారణం.. చివరి నిమిషం వరకు కూడా పార్టీలో ఐక్యత సాధించే ప్రయత్నం చేసినా.. దానిని అందుకోలేక పోవడమేనని అంటున్నారు. తద్వారా పోలింగ్‌పై ప్రజలు నిరాసక్తత చూపించారు.ప్రభుత్వ పనితీరు: ఈ ఎన్నికలను రిఫరెండం అని కూటమి పార్టలు ప్రకటించకపోయినా.. సహజంగానే రెండున్న రేళ్ల ప్రభుత్వ పాలన తర్వాత.. వచ్చిన ఎన్నికలు కావడంతో అందరూ రిఫరెండంగానే భావిస్తారు. ఈ పరంగా చూసుకుంటే.. ఓటింగ్ శాతం తగ్గడంపై ప్రభుత్వం పునరాలోచన చేసుకోవాలని విశ్లేషకులు చెబుతున్నారు.
కీలకమైన పథకాల విషయంలో జరుగుతున్న జాప్యం పెద్దగా ప్రభావం చూపిస్తోందన్నదివారి మాట. నిజానికి ఆర్టీసీ ఉచిత ప్రయాణం తీసుకువచ్చిన ఓట్లు కొంత మేరకు ప్రభుత్వానికి ప్లస్ అయ్యాయన్న వాదన కూడా ఉంది.ప్రజల్లో మార్పు: స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారు. అయితే.. ఈ సారి మా త్రం ఈ తరహా సంస్కృతి కొరవడింది. అదేసమయంలో ప్రచారానికి కూడా పెద్దగా గడువు లేకపోవడం, మధ్యలో తుఫాను బీభత్సం వంటివి కూడా ఈ ఎన్నికలపై ప్రభావం చూపించాయని అంటున్నారు. ఎలా చూసుకున్నా.. ప్రజల్లో కొంత నిరాసక్తత అయితే కనిపించింది. అంతాబాగానే ఉందని ప్రభుత్వం చెబుతున్నా.. ప్రస్తుతం జరిగిన ఓటింగ్ ను అంచనా వేయాల్సిన అవసరం ఉందన్నది పరిశీలకులు చెబుతున్నారు. అనంతరం మార్పుల దిశగా అడుగులు వేయాల్సి ఉంటుందని అంటున్నారు.

ఇక బెట్టింగులు.. ఎవరికోసమంటే.. !



రాష్ట్రంలో తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత.. బెట్టింగుల పర్వానికి తెరదీశారు. ఈ విషయంలో స్థానికంగా ఉన్న నాయకులపైనే కాకుండా.. పార్టీల పై కూడా బెట్టింగులు జరుగుతుండడం గమనార్హం. ఆకివీడు వంటి ప్రాంతాల్లో వ్యక్తుల కేంద్రంగా కోటి రూపాయల వరకు బెట్టింగులు జరిగినట్టు పోలీసులు చెబుతు న్నారు. అయితే.. తెరవెనుక ఎవరు ఉన్నారన్నది మాత్రం ఎవరూ వెల్లడించలేదు. ఇక, విశాఖ, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లోని కార్పొరేషన్ల పరిధిలో కూడా బెట్టింగు బాబు తెరమీదికి వచ్చారు.విజయవాడలో ప్రముఖంగా ఈ బెట్టింగుల పర్వం కొనసాగుతోంది. వంగవీటి రాధా జనసేన తరఫున మేయర్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. అదేసయమంలో మాజీ ఐపీఎస్ అదికారి ఏవీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇక, వైసీపీ తరఫున మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి సైతం గట్టిపోటీ ఇచ్చారని అంటున్నారు అయినప్పటికీ.. వంగవీటి రాధా గెలుపుపైనే ఎక్కువగా బెట్టింగులు కట్టారన్నది బెజవాడ టాక్. దీనికి ప్రధానంగా ఆయనపై ఉన్న నమ్మకమేనని అంటున్నారు.
ఇక, విశాఖలో ముక్కా శ్రావణి వర్సెస్ వైసీపీ నాయకురాలు, ఎమ్మెల్సీ వరదు కల్యాణి మధ్య ఈ ఎన్నికల్లో హోరా హోరీ పోటీ జరిగిందని స్థానికంగా చర్చ సాగుతోంది. కల్యాణి కూడా దూకుడుగానే ప్రచారం చేశారు. కీలకమైన అంశాలను ప్రజల మధ్యకు తీసుకువచ్చారు. ఇక, కూటమి యావత్తు.. ముక్కా శ్రావణికి అండగా నిలిచింది. చివరి నిమిషంలో అందరినీ ఏకం చేయడలో ఎంపీ శ్రీభరత్ ప్రయత్నాలు ఫలించాయి. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య కూడా పోటీ ఎక్కువగానే ఉందని అంటున్నారు.అయితే.. చిత్రంగా ఓటింగ్ శాతం విజయవాడలో 55 శాతం మించకపోగా.. విశాఖలోనూ దాదాపు అదే పరిస్థితి కనిపించింది. దీంతో పోటీ తీవ్రత మరింత పెరిగిందని అంటున్నారు. దీంతో ఎవరు గెలిచినా.. అత్యంత తక్కువ మెజారిటీతోనే గెలుపు గుర్రం ఎక్కే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బెట్టింగులకు మరింత ఊపు వచ్చిందని చెబుతున్నారు. మెజారిటీ బెట్టింగు రాయుళ్లు శ్రావణికి అనుకూలంగా ఉన్నారు. ఇక, తిరుపతిలో కూడా ఇలానే బెట్టింగులకు తెరదీశారు. మొత్తంగా వైసీపీ, టీడీపీ, జనసేనలు బలంగా ఉన్న చోట బెట్టింగులు తెరవెనుక బాగానే సాగుతున్నాయని తెలుస్తోంది. వంగవీటిపై ఓ పారిశ్రామిక వేత్త 2 కోట్ల రూపాయల వరకు బెట్టింగు కట్టేందుకు ముందుకు వచ్చారని ప్రచారం జరుగుతోంది.

ప్రక్షాళన తప్పదా.. అంతా అయ్యాక ఇదే హాట్ టాపిక్.. !



ఇటు టీడీపీ, అటు జనసేన మరో వైపు వైసీపీ.. మూడు పార్టీలకు కీలకంగా మారిన స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాయి. అయితే.. ఈ ఎన్నికల్లో మూడు పార్టీల నాయకులు హద్దులు దాటారన్నది వాస్తవం. ఎక్కడి కక్కడ నాయకులు రెబల్స్‌గా పోటీకి దిగారు. చివరి నిమిషం దాకా.. నాయకులు పోరాటానికే మొగ్గు చూపారు. వీరిలో టీడీపీ నుంచి ఎక్కువ మంది ఉంటే.. జనసేన నుంచి కూడా దాదాపు అంతే మంది పోటీలో నిలిచారు. ఇక, వైసీపీలో చిత్రమైన పరిస్థితి నెలకొంది. పోటీకి సిద్ధమైన నాయకులు చివరి నిమిషంలో వెనక్కి తగ్గారు.
కారణాలు ఏవైనా కూడా.. వైసీపీకి ఛాన్స్ లేకుండా కొందరు అభ్యర్థులు నామినేషన్ల ఉపసంహరణ తర్వాత.. ఎన్ని కల పోలింగ్ రోజు కూడా వెనక్కి తగ్గి.. తాము బరిలో లేమని ప్రకటించు కున్నారు. ఈ ప్రభావం కూడా వైసీపీపై బాగా నే పడిందని అంటున్నారు. ఈ పరిణామాలపై మూడు పార్టీలు కూడా అంతర్మథనంలో పడ్డాయి. టీడీపీ, జనసేనలో రెబల్స్‌తో పాటు ఐక్యత కూడా ప్రశ్నగా మారింది. నాయకులు ఐక్యంగా కొన్ని చోట్ల ప్రచారం చేయలేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. విజయవాడలో టీడీపీ నాయకులు రాధాకు పై పైనే మద్దతు ఇచ్చారన్న చర్చ తెరమీదికి వచ్చింది.
అలా నే.. ఇతర ప్రాంతాల్లోనూ టీడీపీ వర్సెస్ జనసేన మధ్య క్షేత్ర స్థాయిలో ఉన్న వివాదాల కారణంగా నాయకులు ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రక్షాళన దిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయి. తుఫాను ప్రభావం తగ్గడంతోపాటు.. ఎన్నికల ఫలితాలను బట్టి ఈ విషయంపై పార్టీలు దృష్టి పెట్ట నున్నాయని టీడీపీ రాష్ట్ర నేత ఒకరు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ఈ దఫా నాయకులకు బాధ్యతలు ఇస్తారని.. అందరినీ కలుపుకొని పోయే నేతలనే ఎంచుకుంటారని అంటున్నారు.
వైసీపీ లో చాలా మంది చివరి నిమిషంలో కాడి పడేయడంపై ఆ పార్టీలోనూ చర్చ సాగుతోంది. కొందరు నేతలు చే సిన ఈ పని కారణంగా.. ఇతర నాయకులకు అవకాశం చిక్కలేదన్న వాదన ఉంది. ఈ నేపథ్యంలో ఇకపై క్షేత్ర స్థాయి నాయకులతోపాటు.. అధిష్టానమే ఎంపిక చేసే దిశగా అడుగులు వేయాలని నిర్ణయించింది. మొత్తంగా నాయకుల వ్యవహార శైలిపై వైసీపీ నిశితంగానే దృష్టి పెట్టనుందని పార్టీ కీలక నేత లేళ్ల అప్పిరెడ్డి చెబుతున్నారు. ఏదేమైనా.. స్థానిక ఎన్నికల్లోనే నాయకుల వ్యవహారం తేలిపోయిందని.. ఇకపై జాగ్రత్తలు తీసుకుంటామని వెల్లడించడం గమనార్హం.

గోదావరి జిల్లాల్లో జనసేన జోరు!



ఉభయ గోదావరి జిల్లాల్లో జనసేన తన పట్టును నిలుపుకొంది. గత ఎన్నికల్లోనూ కూడా జనసేన ఇక్కడ భారీ విజయం దక్కించుకున్న దరిమిలా.. స్థానిక ఎన్నికలను కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ క్రమంలో తాజాగా జరిగిన పోలింగ్‌లో తూర్పు, పశ్చిమ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో టీడీపీసహా జనసేన జోరు స్పష్టంగా కనిపించింది. ముఖ్యంగా తూర్పు గోదావరి జిల్లా మునిసిపల్ స్థానంలో జనసేన అభ్యర్థులు 100 శాతం స్ట్రయిక్ రేట్‌తో దూసుకు పోయారు. ఆ పార్టీకి కేటాయించిన అన్ని స్థానాల్లోనూ విజయం దక్కించుకున్నారు.ఇక, ఇదే జిల్లాలో బీజేపీకి కేటాయించిన స్థానాల్లో మాత్రం మూడు చోట్ల వైసీపీ అభ్యర్థులు విజయం దక్కించుకున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 96 కౌన్సిలర్ స్థానాలు ఉంటే.. కేవలం 3 చోట్ల మాత్రమే వైసీపీ విజయం సాధిం చగా.. 93 స్థానాల్లో టీడీపీ, జనసేనలు జయభేరి మోగించాయి. ముఖ్యంగా మంత్రి కందుల దుర్గేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న నిడదవోలు నియోజకవర్గం పరిదిలోని అన్ని స్థానాల్లోనూ జనసేన విజయం దక్కించుకోవడం ఆ పార్టీ తన స్థిరత్వాన్ని ప్రదర్శించదనడానికి ఉదాహరణగా మారింది. ఇక, కాకినాడ, గొల్లు ప్రోలు ప్రాంతాల్లోనూ జనసేన అభ్యర్థులు విజయం దక్కించుకున్నారు. దీంతో మునిసిపల్ చైర్మన్ సీటు కూడా కూటమికే దక్కింది. ఇక, పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాలోనూ జనసేన తన పట్టును నిలుపు కొంది. ప్రతి స్థానంలోనూ అభ్యర్థులు విజయం దక్కించుకున్నారు. అయితే.. ఆశించిన ఓటు బ్యాంకు కంటే కూడా తగ్గడం ఒక్కటే మైనస్‌గా మారింది. నిజానికి గెలిచిన ప్రతి అభ్యర్థికీ 200 లోపు మాత్రమే మెజారిటీ దక్కింది. వాస్తవానికి ఏకపక్షంగా విజయం దక్కించుకునే ప్రయత్నాలు చేసినా.. వైసీపీతో హోరా హోరీ పోటీ తప్పలేదని నాయకులు చెబుతున్నారు.

జగన్‌పై కేసు నమోదు

అనుమతి లేకుండా ధర్నా చేశారంటూ కేసు నమోదు

వైసీపీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీ అధినేత జగన్‌పై పోలీసు కేసు నమోదయింది. కడప జిల్లా పులివెందులలో జగన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున అనుమతి లేకుండా ధర్నా చేసి, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆయనపై ఆరోపణలు నమోదయ్యాయి. నవంబర్ 1వ తేదీన జరిగిన పులివెందుల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. తమ పార్టీ ఏజెంట్లను చాలా పోలింగ్ బూత్‌లలోకి రానివ్వడం లేదని ఆరోపిస్తూ జగన్ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలింగ్‌ను వెంటనే రద్దు చేసి, రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అయితే, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, ముందస్తు అనుమతి లేకుండా ఆందోళన చేపట్టారని టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడంతో పులివెందుల అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు, పులివెందులలో రీపోలింగ్ నిర్వహించాలని కోరుతూ వైసీపీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం మంగళవారం కొట్టివేసింది. ఓట్ల లెక్కింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైకోర్టులో పిటిషన్ తిరస్కరణకు గురైన రోజే, ధర్నా ఘటనపై జగన్‌పై కేసు నమోదు కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

రాప్తాడు దాడి నిందితుడి కుడి కాలు తొలగింపు..

కొనసాగుతున్న చికిత్స



రాప్తాడులో ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థినిపై చైన్‌సాతో దాడికి పాల్పడిన నిందితుడు హేమంత్ తన కుడి కాలును కోల్పోయాడు. అరెస్టు సమయంలో పోలీసుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడటంతో, వైద్యులు అతడి కాలును తొలగించాల్సి వచ్చింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో (జీజీహెచ్) ఈ శస్త్రచికిత్స నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి తెలిపారు. ఆదివారం ఆత్మకూరు అటవీ ప్రాంతంలో హేమంత్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ సమయంలో అతడు లొంగిపోకుండా ప్రతిఘటించడమే కాక, ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై దాడికి ప్రయత్నించాడు. పోలీసులు హెచ్చరికగా కాల్పులు జరిపినా వెనక్కి తగ్గకపోవడంతో, ఆత్మరక్షణ కోసం నిందితుడి కాళ్లపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో హేమంత్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. అయితే, కుడి కాలిలో రక్త ప్రసరణ పూర్తిగా నిలిచిపోయి కణజాలం దెబ్బతినడంతో, మోకాలి పైభాగం నుంచి కాలును తొలగించడం తప్పనిసరి అయింది. దెబ్బతిన్న రక్తనాళాల కారణంగా ఎడమ కాలికి కూడా వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం హేమంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని వైద్యులు వెల్లడించారు. అక్టోబర్ 31న రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి గదిలోకి చొరబడిన హేమంత్, చైన్‌సాతో ఇద్దరు విద్యార్థినులపై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గోపిక అనే విద్యార్థిని తీవ్రంగా గాయపడగా, బెంగళూరులో చికిత్స అనంతరం కోలుకుంటోంది. ఆమెను కాపాడే ప్రయత్నంలో మరో విద్యార్థిని కూడా గాయపడింది. ఈ కేసుపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఏపీ లిక్కర్ స్కామ్‌లో అంబటికి ఈడీ సమన్లు..

విచారణకు హాజరుకావాలని ఆదేశం

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా టెండర్ల కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ నిమిత్తం హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా టెండర్ల విధానాన్ని మార్చడం ద్వారా భారీగా అక్రమాలు జరిగాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 200 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర సీఐడీ నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలోనే అంబటి రాంబాబుకు నోటీసులు పంపింది. అయితే, తనకు ఇటీవల గుండెకు స్టెంట్లు వేశారని, ఆరోగ్యం కుదుటపడ్డాక విచారణకు తప్పక హాజరవుతానని అంబటి గతంలో ఈడీకి సమాచారం ఇచ్చారు. ఈడీ నోటీసుల వెనుక రాజకీయ కక్ష సాధింపు ఉందని ఆయన ఆరోపిస్తున్నారు. తనను బెదిరించాలని చూస్తున్నారని, అయితే తాను భయపడబోనని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులో అంబటి అనుచరులుగా భావిస్తున్న మర్రి సుబ్బారెడ్డి, రాయపాటి పురుషోత్తంలను ఈడీ ఇప్పటికే సుదీర్ఘంగా విచారించింది. విచారణకు హాజరయ్యేటప్పుడు పాన్ కార్డ్, ఆధార్, పాస్‌పోర్ట్‌తో పాటు 2019 నుంచి కుటుంబ సభ్యుల పేరిట ఉన్న కంపెనీలు, బ్యాంకు ఖాతాల వివరాలను తీసుకురావాలని ఈడీ తన నోటీసుల్లో పేర్కొంది. ఈడీ ఆదేశాలతో ఈ కేసులో తదుపరి ఏం జరగనుందనే విషయంపై ఆసక్తి నెలకొంది.

పులివెందులలో వైసీపీ పోలింగ్ ఏజెంట్లను తరిమికొట్టారు

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్... ముఖ్యంగా పులివెందులలో, తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. అధికార కూటమి ప్రభుత్వం రిగ్గింగ్, దౌర్జన్యాలకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఈ అంశంపై వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి ఓ టీవీ ఛానల్ డిబేట్‌లో మాట్లాడుతూ అధికార కూటమిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పులివెందులలో తమ పార్టీ ఏజెంట్లను సుమారు 70 పోలింగ్ బూత్‌ల నుంచి తరిమికొట్టి యథేచ్ఛగా రిగ్గింగ్ చేశారని ఆయన ఆరోపించారు. ఎన్నికల సరళిని కవర్ చేయడానికి వెళ్లిన 'ఇండియా టుడే' జర్నలిస్టులు అబ్దుల్ బషీర్, వీడియో జర్నలిస్ట్ విజయ్‌పై అధికార పార్టీ వర్గాలు దాడి చేసి కెమెరాను ధ్వంసం చేశాయని ఆయన మండిపడ్డారు. పులివెందులలో టీడీపీ గూండాల దాడిన తీవ్రంగా ఖండిస్తున్నానని సతీశ్ రెడ్డి చెప్పారు. స్థానిక ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి వైసీపీపై కూటమి ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరించిందని మండిపడ్డారు. పులివెందులలో 80 పోలింగ్ బూత్‌లు ఉంటే... 70 బూత్‌ల నుంచి వైసీపీ ఏజెంట్లను తన్ని తరిమేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఎన్నికల సంఘం, ప్రభుత్వం ఏకమై ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. చివరకు తమ పార్టీ అధినేత జగన్ ను కూడా ఇబ్బంది పెడుతున్నారని సతీశ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఇది అత్యంత ప్రమాదకరమని చెప్పారు.

సీఎం చంద్రబాబుకు కేంద్ర మంత్రి అమిత్ షా ఫోన్..

తుపాన్ల నష్టంపై ఆరా

ఏపీని వరుస తుపాన్లు అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్ చేశారు. రాష్ట్రంలో తుపాన్ల ప్రభావం, జరిగిన నష్టం, ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంపై మొదట అర్నబ్ తుపాను, ఆ వెంటనే మురసు తుపాను ప్రభావం చూపడం వల్ల ఎదురైన క్లిష్ట పరిస్థితులను సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రికి వివరించారు. ఈ రెండు తుపాన్ల కారణంగా పలు జిల్లాల్లో పంట నష్టంతో పాటు భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాన్ని రాష్ట్రానికి పంపినందుకు అమిత్ షాకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. వరుస విపత్తులతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, ఈ క్లిష్ట సమయంలో కేంద్ర ప్రభుత్వం తగిన ఆర్థిక సాయం అందించి రాష్ట్రాన్ని ఆదుకోవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

పెన్ పవర్

కుల్‌దీప్‌కు అవకాశాలివ్వకపోవడం మిస్టరీ.. టీమ్ మేనేజ్‌మెంట్‌పై మాజీ స్పిన్నర్ అసంతృప్తి

- కుల్‌దీప్‌కు అవకాశాలివ్వకపోవడంపై మణీందర్ సింగ్ అసంతృప్తి
- అన్ని ఫార్మాట్లలోనూ రాణించగల సత్తా కుల్‌దీప్‌కు ఉందని వ్యాఖ్య
- జట్టు మేనేజ్‌మెంట్‌కు అతడి సామర్థ్యంపై తగినంత నమ్మకం లేదని వ్యాఖ్య
- గతంలో మురళీ కార్తీక్ కూడా బాగా బౌలింగ్ చేసినా అప్పటి కెప్టెన్లు సరైన అవకాశాలివ్వలేదని ఆరోపణ
- న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లోనైనా కుల్‌దీప్‌కు అవకాశం దక్కుతుందా అనేది ఆసక్తికరం



భారత స్టార్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌కు జట్టులో క్రమం తప్పకుండా అవకాశాలు ఇవ్వకపోవడంపై మాజీ స్పిన్నర్ మణీందర్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. అతడికి తగినన్ని అవకాశాలు ఎందుకు రావడం లేదో తనకు ఇప్పటికీ మిస్టరీగానే ఉందన్నాడు. అన్ని ఫార్మాట్లలోనూ రాణించగల సత్తా కుల్‌దీప్‌కు ఉందని, అతడి బౌలింగ్‌లో వైవిధ్యం ఉందని పేర్కొన్నాడు. జట్టు మేనేజ్‌మెంట్‌కు అతడి సామర్థ్యంపై తగినంత నమ్మకం లేదని, అందుకే తరచూ పక్కన పెడుతున్నారని మణీందర్ అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్‌తో ఇటీవల ముగిసిన టీ20 సిరీస్‌లో భారత్ 3-2తో గెలిచినా కుల్‌దీప్‌కు ఒక్క మ్యాచ్‌లోనూ అవకాశం దక్కలేదు. 124 వన్డేల్లో 201 వికెట్లు తీసిన అతడు.. ప్రస్తుతం భారత జట్టులో ఉన్న బౌలర్లందరి కంటే ఎక్కువ వికెట్లు సాధించాడు.గతంలో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో కుల్‌దీప్‌కు ఐదు మ్యాచ్‌ల్లోనూ అవకాశం ఇచ్చి ఉంటే భారత్ 3-1తో గెలిచేదని తాను భావించానని మణీందర్ చెప్పాడు. అతడిపై తనకు అంతటి నమ్మకం ఉందన్నాడు. గతంలో మురళీ కార్తీక్ కూడా బాగా బౌలింగ్ చేసినా.. కెప్టెన్లు సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్ అతడిపై తగినంత విశ్వాసం చూపలేదని గుర్తుచేశాడు. ఇప్పుడు కుల్‌దీప్ విషయంలోనూ అలాంటి పరిస్థితే కనిపిస్తోందని వ్యాఖ్యానించాడు. ప్రపంచ క్రికెట్‌లో ఎడమచేతి మణికట్టు స్పిన్నర్లు అరుదుగా ఉంటారని, అలాంటి బౌలర్‌కు నిరంతరం అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించాడు. న్యూజిలాండ్‌తో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఐదు వన్డేల సిరీస్‌లోనైనా కుల్‌దీప్‌కు అవకాశం దక్కుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ఏడాది భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్.. కుల్‌దీప్‌పై ఆధిపత్యం ప్రదర్శించాడు. మూడు మ్యాచ్‌ల్లో కుల్‌దీప్ మూడు వికెట్లే తీశాడు. అయితే న్యూజిలాండ్ పిచ్‌లపై బౌలర్లకు కొంత సహకారం లభించే అవకాశం ఉండటంతో కుల్‌దీప్ తన సామర్థ్యాన్ని నిరూపించుకునేందుకు ఇది మంచి అవకాశమని భావిస్తున్నారు.

భారత్ ఐం న్యూజిలాండ్ తొలి వన్డే.. పిచ్ రిపోర్ట్, నేడు వెదర్ రిపోర్ట్ ఇదే!



టీ20 సిరీస్‌ను 3--2 తేడాతో కైవసం చేసుకుని జోరుమీదున్న టీమిండియా, ఇప్పుడు అసలు సిసలైన వన్డే పోరుకు సమాయత్తమైంది. భారత్ వర్సెస్ న్యూజిలాండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా (2026, నవంబర్ 4, బుధవారం) తొలి వన్డే జరగనుంది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ ఇండియన్ టీమ్ కు సారథ్యం వహిస్తుండగా, కివీస్ జట్టును మిచెల్ శాంట్నర్ నడిపించనున్నాడు. అయితే తొలి మ్యాచ్‌పై వర్షం ప్రభావం ఎంత వరకు ఉంది? పిచ్ ఎలా ఉండబోతోంది? అన్న అంశాలనింటిని ఇప్పుడు తెలుసుకుందాం..

ఆక్లాండ్‌లో వర్షం.. మ్యాచ్ జరుగుతుందా?:

క్రికెట్ ప్రేమికులకు కాస్త ఊరటనిచ్చే ముచ్చట ఏంటంటే.. ఈ మ్యాచ్‌కు వాతావరణం దాదాపు అనుకూలించే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఆక్యూ వెదర్ నివేదిక ప్రకారం ఆక్లాండ్‌లో ఉదయం పూట వర్షం కురిసే అవకాశం 56 శాతంగా ఉంది. ఇక స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:00 గంటలకు (భారత కాలమానం ప్రకారం ఉదయం 7:30 గంటలకు) మ్యాచ్ ప్రారంభం కానుంది. ఆ సమయానికి ఆకాశం మేఘావృతమై ఉన్నప్పటికీ వర్షం తగ్గుముఖం పడుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. కాబట్టి మ్యాచ్‌కు పెద్దగా అంతరాయం కలగకపోవచ్చు.. ఉష్ణోగ్రతలు 17 నుంచి 19 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు కానున్నాయి.

పిచ్ రిపోర్ట్:

ఈడెన్ పార్క్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. దీంతో ఇరు జట్లు ఇక్కడ భారీగా పరుగులు చేసే ఛాన్స్ ఉంది.

చిన్న బౌండరీలు: ఈ మైదానంలో బౌండరీలు చాలా చిన్నవి కావడంతో బ్యాటర్లు సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది.

స్పింగ్ ఎఫెక్ట్: కొత్త బంతితో మొదటి కొన్ని ఓవర్లలో ఫాస్ట్ బౌలర్లకు కొంచెం స్పింగ్ లభించినప్పటికీ, ఓవరాల్‌గా ఇది హై-స్కోరింగ్ మ్యాచ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

హిస్టారికల్ రికార్డ్: 2026, సెప్టెంబర్ 27వ తేదీన జరిగిన నాలుగో టీ20 మ్యాచులో ఇదే ఈడెన్ పార్క్ మైదానంలో న్యూజిలాండ్ టీమిండియాపై భారీ విజయం సాధించింది. అప్పట్లో కివీస్ 259/7 స్కోరు చేయగా, భారత్‌ను 172 పరుగులకే ఆలౌట్ చేసి 87 పరుగుల తేడాతో గెలుపొందింది. మరీ చూడాలి ఆ మ్యాచ్ కి ప్రతీకారం తీర్చుకుంటుందో లేదో.

సొంత ఖర్చుతోనే సింధు, లక్ష్యసేన్ విజయాలు.. భారత షట్లర్లకు నిధుల కష్టాలు!

- యూరప్ పర్యటనకు నిధులు విడుదల చేయని సాయ్
- ఆటగాళ్లే ప్రయాణం, భోజనం, వసతి ఖర్చులు భరించిన వైనం
- కొందరు ఆటగాళ్లు కోచ్‌లు లేకుండానే పోటీల్లో పాల్గొన్న దుస్థితి
- గడువులోగా ప్రతిపాదన ఇవ్వలేదని సాయ్ వివరణ
- ఆసియా క్రీడల ఫలితాల వల్లే నిధులు ఆగాయన్న వాదనను ఖండించిన సాయ్



భారత బ్యాడ్మింటన్ స్టార్లు పీవీ సింధు, లక్ష్యసేన్ యూరప్ పర్యటనలో టైటిళ్లు గెలిచి సత్తా చాటారు. అయితే ఆ టోర్నీలకు వెళ్లేందుకు అవసరమైన ఖర్చుల విషయంలో వాళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫిన్లాండ్, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీల్లో జరిగిన నాలుగు టోర్నీలకు భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) నిధులు విడుదల చేయలేదని సమాచారం. 'ఇండియన్ ఎక్స్ ప్రెస్'ను ఉటంకిస్తూ 'ఇండియా టుడే' కథనం ప్రకారం.. ప్రయాణం, భోజనం, వసతి ఖర్చులను ఆటగాళ్లే భరించాల్సి వచ్చింది. నిధులు అందకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన సింధు.. కొంత ఖర్చును తానే భరించానని, ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సంస్థ కూడా సాయం చేసిందని తెలిపింది.నిధుల కొరత ప్రభావం ఆటగాళ్ల సహాయక సిబ్బందిపైనా పడింది. కోచ్‌ల ఖర్చులు భరించలేక కొందరు వారిని వెంట తీసుకెళ్లలేకపోయారు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అమ్మితా చాలిహా, డెన్మార్క్ ఓపెన్‌లో తన్వీ శర్మ కోచ్ సహాయం లేకుండానే పోటీపడ్డారు. నిధులు నిలిచిపోవడానికి కారణంపై భిన్న కథనాలు వెలువడ్డాయి. ఆసియా క్రీడల్లో భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రదర్శన దీనికి కారణమై ఉండొచ్చని కొందరు అనుమానించినా.. ఆ వాదనను సాయ్ అధికారి ఖండించారు. టోర్నీలకు 30 రోజుల ముందుగా సమర్పించాల్సిన ప్రతిపాదనను బ్యాడ్మింటన్ సంఘం (బీఏఐ) గడువులోగా ఇవ్వకపోవడంతో నిధులు విడుదల కాలేదని వివరించారు. నిధుల ఇబ్బందుల నేపథ్యంలోనూ భారత ఆటగాళ్లు మంచి ఫలితాలు సాధించారు. జర్మనీలో జరిగిన హైలో ఓపెన్‌లో లక్ష్యసేన్ పురుషుల సింగిల్స్ టైటిల్ గెలవగా, సింధు మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది. ఈ ఏడాది ఆమెకు ఇది రెండో టైటిల్. మరోవైపు, రాబోయే టోర్నీలకు నిధుల సాయం పునరుద్ధరిస్తామని సాయ్ తెలిపినట్లు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది. అయితే యూరప్ పర్యటనలో ఆటగాళ్లు స్వయంగా పెట్టుకున్న ఖర్చులను తిరిగి చెల్లించబోమని స్పష్టం చేసినట్లు తెలిపింది.



'పాన్ ఇండియా' ఎవరు మొదలు పెట్టారు? 'కింగ్ నాగార్జున'పై సూర్య ఆసక్తికర వ్యాఖ్యలు





నేటి సినీ పరిశ్రమలో -పాన్-ఇండియా- అనే పదం ఎంతో ప్రాచుర్యం పొందింది. ప్రతీ ఒక్కరూ బహు భాషలలో సినిమాలు చేస్తూ సరిహద్దులు చెరిపేస్తున్న వేళ.. ఈ ట్రెండ్‌ను దశాబ్దాల క్రితమే ప్రారంభించిన మార్గదర్శి గురించి కోలీవుడ్ స్టార్ హీరో సూర్య చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తించాయి. అసలు పాన్ ఇండియా సినిమాని సౌత్ లో ప్రారంభించింది ఎవరో సూర్య క్లారిటీ గా చెప్పారు.టాలీవుడ్ సీనియర్ హీరో -నాగ్ సర్- దీనికి ఆద్యుడు అని సూర్య వ్యాఖ్యానించారు. తన కొత్త చిత్రం -సీన్- ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న సూర్య నేరుగా నాగార్జునపై ప్రశంసల జల్లు కురిపించారు. నాగ్ సర్ ఇతర భాషల దర్శకులతో పని చేయడమే కాకుండా..స్వయంగా పోరుగు పరిశ్రమలలో నటిస్తూ పాన్ ఇండియా ట్రెండ్ సెట్టర్‌గా నిలిచారని కీర్తించారు.నాగార్జున పాన్-ఇండియా విజన్ గురించి సూర్య ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఆసక్తికర అంశాలను వెల్లడించారు. నేడు ట్రెండ్‌గా మారిన పాన్-ఇండియా కాన్సెప్ట్‌ను నాగ్ సర్ ఎప్పుడో ముందే ఆచరణలో పెట్టారని అన్నారు. మణిరత్నం, ఫాజిల్, ప్రియదర్శన్ వంటి ఇతర భాషల దిగ్గజ దర్శకులతో కలిసి పనిచేస్తూ పోరుగు సినీ పరిశ్రమలను అనుసంధానించడంలో నాగార్జున ఎప్పుడూ ముందున్నారని చెప్పారు. మంచి సినిమాను, వైవిధ్యమైన కంటెంట్‌ను ఎల్లప్పుడూ ఆదరించే నాగ్ తత్వమే తనకు ప్రధాన స్ఫూర్తి అని సూర్య కొనియాడారు.అభిమానుల కోలాహలం మధ్య జరిగిన ఈ వేడుకలో సూర్య భావోద్వేగంతో మాట్లాడుతూ.. తమ మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అభిమానులు చూపిస్తున్న అన్‌లిమిటెడ్ ప్రేమకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని.. --మనమంతా ఒకే కుటుంబం- అని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం తమ పనులన్నీ పక్కన పెట్టి.. సభకు భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానులకు, భద్రతా సిబ్బందికి .. మీడియా ప్రతినిధులకు సూర్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇక అభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న -రోలెక్స్- సినిమా గురించి సూర్య ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. --స్క్రీన్ పై హీరోనా, విలనా? ఎవరు బెటర్ అంటే.. విలన్ పాత్రే చాలా బెటర్! ఇప్పటివరకు చాలా మంది హీరోలు వచ్చారు... ఇప్పుడు ఒక పవర్‌ఫుల్ విలన్ రావాల్సిన అవసరం ఉంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్‌ను నన్ను కలవమని చెప్పండి.. త్వరలోనే రోలెక్స్ ప్రాజెక్ట్‌ను మనం సాధ్యం చేద్దాం-- అంటూ సూర్య చేసిన వ్యాఖ్యలు ఫ్యాన్స్‌లో విపరీతమైన జోష్ నింపాయి.అలాగే తాను నటించిన -సీన్- చిత్రంలోని ఒక శక్తివంతమైన మెసేజ్ ని తన డైలాగుల్లో చెప్పారు.--ఐ యామ్ ది బెస్ట్.. ఐ కెన్ డు ఎనీథింగ్-- (నేనే బెస్ట్.. నేను ఏదైనా చేయగలను) అనే డైలాగ్ ఇతరులతో పోటీపడేందుకు కాదని.. మనపై మనకు నమ్మకం పెంచుకోవడానికేనని చెప్పారు. తాను కూడా ఒకప్పుడు ఎంతో సాధారణమైన ఇంట్రోవర్ట్ వ్యక్తిగా ఉండేవాడినని..తనకే ఇది సాధ్యమైనప్పుడు ప్రతి ఒక్కరూ సాధించగలరని భరోసా ఇచ్చారు. నాగార్జునపై సూర్య చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.



స్టైలిష్ బ్లూ డెనిమ్ జంప్‌సూట్ లో మెరిసిపోయిన ఐషా శర్మ - ఫోటోషూట్

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965